తీన్మార్
తెలుగు దినపత్రిక

# వాడిన పుస్తకాలే వికసించెనే!

హైదరాబాద్ వాసులకు పాత పుస్తకాల లభ్యత గురించి ఎలాంటి ఫికరు లేదు. చదవడం పట్ల ఆసక్తి ఉన్న వారి కోసం తక్కువ ధరలో పాత పుస్తకాలు అమ్మే దుకాణాలు ఇక్కడ చాలానే ఉన్నాయి. ఆదివారం వచ్చిందంటే అబిడ్స్ సర్కిల్‌లో మూసి ఉండే షాపుల ఫుట్ పాత్‌లపై ఎన్నో సెకండ్ హ్యాండ్ బుక్స్ కొలువు తీరుతాయి. కొత్త ముద్రణలతో అందుబాటులో లేని ఎన్నో విలువైన పుస్తకాలు ఇక్కడ దర్శనమిస్తాయి. ఒక్కోసారి ప్రసిద్ధ రచయితలు కోడిలా తల కింది కేసుకొని ఏదో పుస్తకం కోసం వెతుకులాడుతూ కనబడుతారు. ఓ రచయిత ప్రముఖుడి పేరు రాసి మర్యాదగా ఇచ్చిన పుస్తక ప్రతి ఉన్న దున్నట్లుగా కనబడి అయ్యో పాపం అనిపిస్తుంది. నడుస్తూ నడుస్తూ ఇలాంటి వింత అనుభవాలను కూడా కనవచ్చు. రోజు కాళ్లాడే చోట వారానికొకసారి ప్రపంచ జ్ఞానం పరిచుండే ఈ దృశ్యాన్ని సండే స్పెషల్ హైదరాబాద్ బుక్ ఫెయిర్ అనొచ్చు. ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థుల కోసం కోరినన్ని పాత టెక్ట్ బుక్స్, రెఫరెన్స్ పుస్తకాలు కోఠి సెంటర్‌లో దొరుకుతాయి. చదువైపోయాక అమ్మేసే విద్యార్థుల పుస్తకాలు ఆయా కోర్సుల్లో చేరే వారికి డిస్కౌంట్ ధరలకు లభిస్తాయి. అలా ఆ సబ్జెక్టుకు డిమాండ్ ఉన్నంత కాలం ఆ పుస్తకం చేతులు మారుతూనే ఉంటుంది. దేశంలోని ప్రధాన నగరాల్లో ఇలా పాత పుస్తకాల అమ్మకాల సందడి ఉండే ఉంటుంది. నగరాలకు దూరంగా ఉన్నవారి కోసం లేదా పాత పుస్తకాల ప్రదర్శనకు రాలేనివారి కోసం ఇప్పుడు ప్రత్యేకంగా ఆ పుస్తకాలతో రకరకాల వెబ్ సైట్లు ఆన్‌లైన్ అమ్మకాలు చేపడుతున్నాయి. వాటిలో చెన్నైకి చెందిన 'యూజ్డ్ బుక్స్ ఫ్యాక్టరీ' ఒకటి. దీనిని 30 ఏళ్ల తిలక్ దేసింగ్ అనే యువకుడు నడుపుతున్నాడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన తిలక్ శని, ఆదివారాల్లో ఈ ఫ్యాక్టరీ పనుల్లో నిమగ్నమైతాడు.తనకు తోడుగా ఆయనకు తల్లిదండ్రులు కూడా ఇందులో పాల్గొంటారు. తాను ఐఐటి కి తయారవుతున్న రోజుల్లో చెన్నైలోని అన్ని పాత పుస్తకాలు షాపుల చుట్టూ కావలసిన బుక్స్ కోసం తిరగవలసి వచ్చింది. దాని కోసం ఎంతో సమయం వృథా అయ్యేది. ఆ కష్టం కొందరికైనా తగ్గించేందుకు ఉద్యోగంలో చేరాక ఎందరో ఫ్రెండ్స్ దగ్గర వున్న పుస్తకాలను స్వయంగా తీసికెళ్ళి అవసరమున్న విద్యార్థులకు అందజేసేవాడు. అలా సెలవుల్లో విశ్రాంతి తీసుకోకుండా ఒక్కోసారి పది మంది ఇళ్ళకి వెళ్లి బుక్స్ అందజేసేవాడు. కొన్నాళ్ల తరవాత తాను సేకరించిన పుస్తకాలను ఒఎల్ఎక్స్‌లో పెట్టి కోరిన వారికి ఫ్రీగా పంపేవాడు. ఈ పంపిణి కోసం ఒక ఇ కామర్స్ లాంటి వ్యవస్థ అవసరమని భావించి స్వయంగా 2017లో మొదట 'చెన్నై యూజ్డ్ బుక్స్ డాట్ కామ్' ఆరంభించాడు. ఈ డొమైన్ ను రిజిస్ట్రీ చేయడానికి రూ. 1000/- ఖర్చయింది. అదే ఆయన పెట్టుబడి. చెన్నైలో తమ వద్దనున్న బుక్స్ అవసరమున్నవాళ్లు తీసికెళ్ళేలా లొకేషన్ మ్యాప్‌తో ఫేస్‌బుక్ ఖాతా తెరిచాడు. విచిత్రమేమిటంటే తీసికెళ్ళేవారి కన్నా తమ వద్ద పాత పుస్తకాల ఎన్నో వున్నాయి, వాటిని ఫ్రీగా మీకు పంపిస్తామని అడిగేవాళ్ళు ఎక్కువయ్యారు. దాంతో అనవసరపు పుస్తకాల తెప్పించకుండా కొన్ని విధానాలు పెట్టాడు. చినికిపోయిన, అయిదేళ్ల కన్నా పాత పుస్తకాలు, సిలబస్ మారిన టెక్ట్ బుక్స్ వద్దని చెప్పడం జరిగింది. అవేవి పాటించకుండా కొందరు పంపడంతో మీ వద్దనున్న పుస్తకాల ముఖచిత్రం ఫోటో తీసి పంపితే వాటిలోంచి ఎంపిక చేసుకుంటామని మరో నిబంధన పెట్టడం జరిగింది. పుస్తకాల పంపిణీ కోసం తక్కువ ధరకు కొరియర్ సంస్థలతో ఒప్పందాలు చేసుకొన్నాడు. దూరప్రాంతాలకు పంపే పుస్తకాలకు వాటి ధర కన్నా కొరియర్ ఖర్చు ఎక్కువయ్యేది. ఒక్కోసారి జమ్మూ కశ్మీర్ దాకా పంపవలసి వచ్చేది. అలా సేకరించిన లక్షకు పైగా పుస్తకాల కోసం ప్రత్యేకంగా 'యూజ్డ్ బుక్స్ ఫ్యాక్టరీ' అనే ఆన్‌లైన్ సేల్స్ వ్యవస్థను ఆరంభించాడు. ఈ పంపిణీ వ్యాపారంగా మారడంతో తిలక్ తన ఉద్యోగాన్ని వదిలేసి పూర్తి కాలం దీనికే వినియోగిస్తున్నారు. ఇప్పుడు పది లక్షల పుస్తకాల సామ్రాజ్యం ఆయనది. ఒక స్టేట్ లైబ్రరీ స్థాయిలో చెన్నైలో నాలుగు అంతస్తుల్లో ఈ పుస్తకాలు అక్షర క్రమంలో సర్ది వున్నాయి. ఫిక్షన్, నాన్ ఫిక్షన్, కిడ్స్, ఎడ్యుకేషన్ ఇలా పుస్తకాలను విభజించారు. పుస్తకాలు ధర తక్కువే కాకుండా ఫ్రీ డెలివరీ వుంటుంది. 10-12 పుస్తకాలు ధర రూ.999/-, 25 పుస్తకాలకు రూ. 1999/-, 40 పుస్తకాలకు రూ. 2999/- మాత్రమే చెల్లించాలి. రచయిత, పుస్తకం పేరును సైట్లో ఎంపిక చేసుకోవచ్చు. ప్రస్తుతానికి ఇంగ్లీష్ పుస్తకాల అమ్మకాలు వీరు నిర్వహిస్తున్నారు. హిందీ, తమిళ పుస్తకాల సేకరణ జరుగుతోంది. దేశంలోని సెకండ్ హ్యాండ్ బుక్స్ అమ్మేవారి నుండి క్యాటలాగులు తెప్పించుకొని వారికి కూడా వ్యాపార వృద్ధిలో తోడ్పడుతున్నారు. ఆన్‌లైన్ వ్యాపారంతో పాటు 'యూజ్డ్ బుక్స్ ఫ్యాక్టరీ' తరపున దక్షిణ భారతంలో పుస్తక ప్రదర్శన అమ్మకాలను ఆరంభించారు. ప్రతి ప్రధాన నగరానికి ఏడాదికి రెండు సార్లు వచ్చి పుస్తకప్రియుల అవసరాలను తీర్చుతున్నారు. ప్రదర్శనల్లో పుస్తకాలను అట్ట పెట్టెల సైజు ఆధారంగా అమ్ముతారు. ప్రవేశ రుసుము లేదు. చిన్న పెట్టె ధర రూ.1199/-. ఇందులో 10 -12 బుక్స్ పడతాయి. మధ్యస్థ పెట్టె ధర రూ. 1799 /-, 30 పుస్తకాల పెట్టె పెద్ద పెట్టె ధర రూ.2999/-. 29 డిసెంబర్ 2023 నుండి 1 జనవరి 2024 వరకు హైదరాబాద్‌లో ఈ ప్రదర్శన ఉంటుంది. లక్డీకాపూల్ సమీపంలోని మారుతి గార్డెన్స్‌లో ఏర్పాటు చేస్తున్నామని వారి సైట్లో ఉంది. పుస్తకమే మనిషి అభివృద్ధికి వారధి. రచయిత శారీరక శ్రమ, మేధోమథనంతో రూపొందిన పుస్తకం సమాజ వికాసానికి ఉద్దేశించబడింది. చదివి నేర్చుకోవలసిన విషయాలు మంచి పుస్తకంలో ఎన్నో ఉంటాయి. రోజు నాలుగు పేజీలైనా చదువుతామని చెప్పే విజ్ఞుల మాట ఆదర్శనీయం. ఇంగ్లీష్ అనగానే భయపడే అవసరం కూడా లేదు. ఇండియాకు చెందిన ఎందరో ఆంగ్ల రచయితలు మన సమాజం, మన జీవన విధానంపై సులభమైన రీతిలో రచనలు చేశారు. ఆంగ్ల పఠన ప్రవేశానికి అవి ఎంతో ఉపయోగపడతాయి.

# యువజనోత్సవ సందర్భంగా యువ కళాకారుల ఎంపిక

**- క్రీడల వల్ల వ్యక్తిత్వ వికాసం పెరుగుతుంది**

భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక-2024 27వ జాతీయ యువజనోత్సవాల సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక 21-12-2023వ తేదీన భువనగిరి ఖిల్లా, భువనగిరి నందు ఉదయం 10 :00 గంటలకు ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక ఎసిపి వెంకట్ రెడ్డి, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, వార్డు కౌన్సిలర్ లక్ష్మీ, జిల్లా యువజన & క్రీడల శాఖ అధికారి కె. ధనుంజనేయులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంను ప్రారంభించారు. అనంతరం ఇట్టి కార్యక్రమమును ఉద్దేశించి ఏసిపి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు మరియు యువత చదువుతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమములలో పాల్గొనడం ద్వారా మానసిక మరియు శారీరక ఉల్లాసం కలిగి వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని తెలిపినారు. అదేవిధంగా జిల్లా యువజన & క్రీడల శాఖ అధికారి కె. ధనుంజనేయులు మాట్లాడుతూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమముల ద్వారా యువతీ యువకుల్లో దాగివున్న సాంస్కృతిక కళా నైపుణ్యాలను వెలికితీసి, ఇక్కడ నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్ర స్థాయి లో పాల్గొనుటకు





పంపించబడును అని తెలిపినారు. రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ ప్రదర్శన చేసి అక్కడ ఎంపిక కాబడిన ఉత్తమ కళాకారులు జనవరి 12నుండి 16వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారని తెలియజేసినారు. జిల్లా స్థాయిలో న్యాయ నిర్ణేతలుగా డ్యాన్స్ మాస్టర్స్ - భరత్, రమేశ్ రాజ్, శ్రీనివాస్ ,యం.డి. జైనులుద్దీన్, యన్.కృష్ణ, వినోద్ ల ఆధ్వర్యంలో విజేతలను ఎంపిక చేశారు.

**సాముహిక ప్రదర్శనలు:**

1.జానపద నృత్యము: మొదటి విజేత : క్యాండర్ గ్రూప్ (కొయ్యలగూడెం) ద్వితీయ విజేత :స్పందన డ్యాన్స్ గ్రూప్ (జనగాం -నారాయణపూర్ ), తృతీయ విజేత :జాస్మిన్ డ్యాన్స్ గ్రూప్ (భువనగిరి)

2.జానపద నృత్యము:మొదటి విజేత : టి.చైతన్య (భువనగిరి) ద్వితీయ





విజేత : బి.సౌమ్యశ్రీ (భువనగిరి) తృతీయ విజేత : అర్.శ్రీజ

3 .జానపద గేయాలు: మొదటి విజేత :జె.చందన (జనగాం - నారాయణపూర్) ద్వితీయ విజేత : సిహెచ్. వర్షిణి (జానకిపురం - అడ్డగుడూర్ )

వ్యక్తిగత ప్రదర్శనలు:

4.వ్యాస రచన పోటీ: హిందీ :మొదటి విజేత :మహేశ్వరి . ద్వితీయ విజేత :ఎండీ.సానియా ఇంగ్లీష్ : మొదటి విజేత :పి. అంజలి, ద్వితీయ విజేత :బి. బిందు

5. పోస్టర్ మేకింగ్: మొదటి విజేత : ఎన్.లావణ్య, ద్వితీయ విజేత: పి. అంజలి. తృతీయ విజేత: టి.అమూల్య.

6. వకృత్వ పోటీ: మొదటి విజేత :బి.బిందు

ఇట్టి కార్యక్రమములో సుమారు 250 మంది కళా ఔత్సాహిలు , యువజన సంఘాల అధ్యక్షులు కరుణ్, మరియు కార్యాలయ సిబ్బంది మురళి, జయ రాజశేఖర్, బి.రేణుక, కైసర్, శ్రీనివాస్, రేణుక, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి ఆలయ ఈవో గా గీత రాజీనామా

**- ప్రభుత్వ ఆదేశాల మేరకే నిర్ణయం**
**- 9 సంవత్సరాలుగా ఏకచత్రాధిపత్యం వహించిన గీత**
**- భక్తులతోపాటు,వర్తక వ్యాపారులకు, ఉద్యోగులకు ఇబ్బందులు**
**- బాధ్యతలు తీసుకున్న రామకృష్ణ**

యాదగిరిగుట్ట, డిసెంబర్ 21 (తీన్మార్ న్యూస్):యాదాద్రి ఆలయ ఈవోగా కొనసాగుతున్న గీత గురువారం రాజీనామా చేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకే రాజీనామా చేసినట్లు తెలిసింది. 2014 సంవత్సరంలో యాదగిరిగుట్ట ఆలయ ఈవో గా బాధ్యతలు చేపట్టిన గీత 2020లో ఉద్యోగ విరమణ జరిగినప్పటికీ అప్పటి కెసిఆర్ ప్రభుత్వం ఈవో గా కొనసాగాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో 2023 డిసెంబర్ వరకు ఆమె బాధ్యతల్లో కొనసాగారు. కాగా ఇటీవల



ఆలయ ఈవో గీతా



ఇంచార్జీ ఈవో గా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణ

జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది అధికారంలోకి రాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు యువగీతా రాజీనామా చేశారు. సుమారు పది సంవత్సరాల కాలంలో ఆమె అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకొని అమలు చేశారు. పాలకవర్గం కూడా లేకపోవడంతో ఈవో గీత చెప్పిందే వేధంగా సాగింది. ఉద్యోగ విరమణ జరిగినప్పటికీ తిరిగి గీతను ఈవోగా కొనసాగించడంతో ఆలయం నూతన నిర్మాణంతో పాటు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫుల్ పవర్ అప్పగించడంతో ఆమెకు ఎదురు లేకుండా పోయింది. దీంతో సామాన్య భక్తులు కూడా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పటి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ని కూడా ఖాతరు చేయకుండా ఈవో గీత నిర్ణయాలు తీసుకున్నారు. రాజీనామా చేసిన అనంతరం ఈవోగా రామకృష్ణ ఇన్చార్జి బాధ్యతలు చేపట్టి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

# ఇంజ మాధవి మహేష్ కు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్




రాజాపేట, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): ఐ ఎన్ టి యు సి -327 భువనగిరి డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్, దళిత రత్న అవార్డు గ్రహీత ఇంజ మహేష్ సతీమణి, ఇంజ మాధవి జన్మదిన పురస్కరించుకొని, ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలన్నని, తన నివాసంలో కలసిన సందర్భంగా, వారిని బీర్ల ఐలయ్య శాలువతో, ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇంజ మాధవి మహేష్, ప్రభుత్వ విప్, ఈ సందర్భంగా ఆలేరు శాసనసభ్యులు ఐలన్నకు, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రాజాపేట లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు

**- చర్యలకు పలువురి ఫిర్యాదులు**





రాజాపేట, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): రాజపేట మండల కేంద్రంలో గత ఐదు సంవత్సరాల నుండి గ్రామపంచాయతీ పరిధిలో అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయంలో నిర్లక్ష్యం తోపాటు మద్దతు పలకడంతో గత ఐదు సంవత్సరాలు అక్రమ నిర్మాణాలు తప్పుడు నిర్ణయాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయంపై సంబంధిత మండల జిల్లా అధికారుల సైతం పట్టించుకోకపోవడంతో ప్రజలు నాయకులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన రాజాపేట లో గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న పొరపాట్లపై విచారణ జరపాలని చర్యలుతీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల జరిగిన అక్రమ నిర్మాణంలో స్పందించిన కార్యదర్శి రేకులపల్లి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కూల్చివేతలు చేపట్టారు.

# మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన సర్పంచ్



రాజాపేట, డిసెంబరు 21(తీన్మార్ న్యూస్): రాజపేట మండలం, రఘునాధపురం ప్రాథమిక పాఠశాలలో గురువారం గ్రామ సర్పంచ్ గాడిపెల్లి శ్రావణ్ కుమార్, చిన్న గౌరాయపల్లి ఉపసర్పంచ్ గంజి పాండురంగం విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం ఆహార పదార్థాలను సర్పంచ్, ఉపసర్పంచ్ అకస్మాత్తుగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు రోజు పెట్టే మధ్యాహ్న భోజనం ఆహార పదార్థాల మెనూ వాటి రుచులను ఎలా ఉన్నాయని అడగగా చాలా బాగున్నాయని సంతృప్తినీ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప సర్పంచ్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మాధవ రెడ్డికి టీచర్ల బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# కేంద్రంలో పేరుకుపోతున్న 'ఉపాధి' బకాయిలు

న్యూఢిల్లీజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర లను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తూనేవుంది. ఉపాధి హామీ చట్టం ప్రకారం ఈ పథకానికి నిధులు సమకూర్చాల్సిన కేంద్ర ప్రభుత్వం కనీసం ఉపాధి కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలకు సంబంధించిన డబ్బులు కూడా ఇవ్వడం లేదు. దీంతో యేటికేడూ కేంద్రం ప్రభుత్వం 'ఉపాధి' బకాయిలు పేరుకుపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు రూ.110.56 కోట్ల ఉపాధి హామీ వేతనాల బకాయిలు ఉన్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.2023 నవంబర్ 29 వరకు ఎపికి రూ.110.56 కోట్లు వేతనాలకు సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు రూ.10.96 కోట్లు బాకాయిలు ఉన్నాయని తెలిపారు.రూపాయి కూడా విదిల్చని కేంద్రం : విజయసాయిరెడ్డి



ఆంధ్రప్రదేశ్‌కు 15వ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. వైసిపి ఎంపి వి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

# మహిళలు సామాజికంగా ఎదగాలి

కరీంనగర్ :మార్వాడి మహిళలు సామాజికంగా, సాంస్కృతికం ఎదిగి సమాజంలో భాగస్వాములు కావాలని అఖిల భారత మార్వాడి మహిళా మండలి అధ్యక్షురాలు నీరాజీ బత్వాల్ అన్నారు.దక్షిణ భారత మార్వాడి మహిళా మండలిని విస్తృత పరిచేందుకు, సంఘాలను బలోపేతం చేసేందుకు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కరీంనగర్ మార్వాడి మందిర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అందరు కలిసి కట్టుగా సమాజంలో కలిసిపోవాలని సూచించారు. ఈ సందర్భం గా మహిళలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. చరవాణితో నష్టాలు తెలియజేస్తూ, నారీ శక్తి గురించి, ఆహారం వృథా చేయొద్దని తెలియజేసే నాటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మర్వాడి మహిళా మండలి దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షురాలు రేఖ, తెలంగాణ అధ్యక్షురాలు అరుణా జవ్వాల్, కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు సరళా ముందాడా, సంఘ ప్రతినిధి సునందా ముందాడా, తదితరులు పాల్గొన్నారు.

# కీటక జనిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ జెడెంగే హనుమంతు కొడింబా
- కలెక్టరేట్ లో అధికారులకి శిక్షణా తరగతులు






భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): కీటక జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజల ఆరోగ్యం పట్ల క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జండగే వైద్యాధికారులకు సూచించారు. గురువారం నాడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, హెల్త్ సూపర్వైజర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, మల్టీపర్పస్ హెల్త్



అసిస్టెంట్లకు నిర్వహించిన కీటకజనిత వ్యాధుల నివారణ శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య సంరక్షణ పట్ల, కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మలేరియా కేసులు గుర్తించినప్పుడు ఫీవర్ సర్వే నిర్వహించాలని, కేసుకు సంబంధించి దగ్గర ఉన్న కుటుంబ సభ్యుల రక్తం నమూనాలు సేకరించాలని, చుట్టుపక్కల ఇళ్లలో కూడా ఫీవర్ సర్వే నిర్వహించాలని, దోమలు ఉ ండే ప్రదేశాలలో యాంటీ లార్వా మందులతో నియంత్రించాలని, ఇండోర్ స్ప్రే, అవుట్డోర్ స్ప్రే కార్యక్రమాలను చేపట్టాలని, చెరువులు కుంటలలో యాంటి లార్వా చర్యలు చేపట్టాలని, వాడకం లేని నీరు ఉన్న ప్రాంతాలలో కెమికల్స్ స్ప్రే చేసి నియంత్రించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో వైద్యశాఖ (శిక్షకులు) అసిస్టెంట్ డైరెక్టర్లు విజయ్ కుమార్, నాగయ్య, జిల్లా వైద్య అధికారి డాక్టర్ పరిపూర్ణాచారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వినోద్, డాక్టర్ యశోద, డాక్టర్ పాపారావు, డాక్టర్ సుమన్, వైద్య అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): జిల్లా స్థాయిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వేడుకలు గురువారం రాయగిరి లోని లింగ బసవ ఫంక్షన్ హాల్ నందు భువనగిరి జిల్లా సంక్షేమ అధికారి మహిళ శిశు వికలాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ అధికారి జి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మెన్ బిక్కు నాయక్, ఎంపీపీలు నరాల నిర్మల, భూఖ్య సుశీల తుర్కపల్లి, నూతి రమేష్ వలిగొండ, జెడ్పీటీసీ బీరు మల్లయ్య భువనగిరి, తోటకురి అనురాధ, జెడ్పీటీసీ యాదగిరి, దివ్యాంగుల సంఘాల వారు, దివ్యాంగుల కమిటి మెంబర్లు, జిల్లా సంక్షేమ అధికారి మహిళ శిశు వికలాంగుల మరియు వయో వృద్దుల సంక్షేమ కార్యాలయ సూపర్నిడెంట్ జి.శశికళ, కార్యాలయ సిబ్బంది, ప్రాజెక్ట్ అధికారులు, మొదలయిన వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటల పోటీల లో గెలుపొందిన దివ్యాంగులకు ప్రశంసా పత్రాలను మరియు జిల్లా లోని దివ్యాన్గుల అసోసియేష్ సభ్యులకు జ్ఞాపకల తో సన్మానించి వారికి అందజేశారు. నరాల నిర్మల ఎంపీపీ మాట్లాడుతూ ఇటువంటి ప్రోగ్రామ్ లను మండల స్థాయిలో నిర్వహిస్తే బాగుంటది అని తెలియజేశారు. భూక్యా సుశీల తుర్కపల్లి ఎంపీపీ దివ్యాంగుల సమస్యల ఏవయిన ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కొరారు.





నూతి రమేష్ మాట్లాడుతూ దివ్యాంగులు ప్రభుత్వ ప్రయివేటు రంగాలలో ముందుండాలని ఆకాంక్షించారు. బీరు మల్లయ్య భువనగిరి. జెడ్పీటీసీ మాట్లాడుతూ దివ్యాంగులు ఆటల పోటీలలో పాల్గొడం వల్ల మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కలుగుతుందని ఉంటుందని తెలిపారు. తోటకూర అనురాధ జెడ్పీ టీసీ దివ్యాంగులు అన్ని రంగాల్లో పాల్గొనాలని, వారు తలుచుకుంటే అన్ని రంగాలలో విజయం సాధిస్తారని వారిని ఎవరు దూషించరాదని, చిన్న చూపు చూడకుండా వారిపట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలని కోరారు. బీక్కు నాయక్ జిల్లా వైస్ చైర్మన్ యాదాద్రి భువనగిరి మాట్లాడుతూ దివ్యాంగులకు సాధారణ వ్యక్తుల కన్నా ఐక్యూ లెవెల్ ఎక్కువగా ఉంటుందని అవకాశం లభిస్తే అన్ని రంగాలలో ముందు ఉంటారని కళ్ళు లేకున్నా బ్రెయిలీ లిపి తో చదువుకొని కలెక్టర్లు సైతం అయ్యారని దీనిని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలియజేశారు. జి అన్నపూర్ణ జిల్లా సంక్షేమ అధికారి మహిళ మరియు వయోవృద్ధుల సంక్షేమం యాదాద్రి భువనగిరి మాట్లాడుతూ ఆటల పోటీలు లలో పాల్గొనడం వల్ల వారికీ మానసిక ప్రశాంతత శారీరక దృఢత్వం అందరితో కలిసిపోయే గుణాన్ని అలవర్చు కొగలుగుతారని, మరియు వీరికి కావాల్సిన ప్రభుత్వం నుండి అందవలసిన 6అన్ని సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తూ వారి సమస్యలను కూడా కార్యలయం ద్వార పరిష్కరిస్తున్నామని తెలియజేశారు.

# డ్రమ్ సీడర్ పద్ధతి రైతులకు మేలు

- ఏఓ రామదుగు వాణి

పాలేరు ప్రతినిధి, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): కూసుమంచి మండలంలోని జక్కేపల్లి గ్రామంలోని కొత్త వెంకట్ రెడ్డి అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో డ్రం సీడర్ ద్వారా నేరుగా వరి విత్తే పద్ధతిని మండల వ్యవసాయ అధికారిణి రామదుగు వాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాసంగిలో వరి వేయవలసిన రైతులందరూ నేరుగా విత్తె పద్ధతులైనటువంటి వెదజల్లడం, డ్రం సీడర్ లాగడం, సీడ్ కం ఫర్టి డ్రిల్లు పద్ధతులను అవలంబించడం శ్రేయస్కరిమని సూచించారు. ఈ పద్ధతుల ద్వారా విత్తనాలపై పెట్టే ఖర్చు సగానికి సగం తగ్గడంతో పాటు నాటుపెట్టేందుకు కూలీల ఖర్చు కూడా తగ్గుతుందని సుమారు ఎకరానికి రూపాయలు 7000 నుండి 8000 వరకు ఆదా చేయవచ్చని అంతేకాకుండా నాటు పెట్టే విధానం లేనందువలన పంట కాలం 10 నుండి 15 రోజులు



ముందుగా వస్తుందని కావున అధిక సంఖ్యలో రైతులందరూ సులువైన ఈ పద్ధతులను అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సౌమ్య రైతులు పాల్గొన్నారు.

# దళితుల భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ దుర్గయ్య

తుర్కపల్లి, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): మండలంలోని వాసాలమర్రి గ్రామంలోని 183 సర్వేనంబర్ లో గల దళితుల ఇండ్ల స్థలాలకు సంబంధించిన 36 గుంటల విస్తీర్ణం గల భూమిని అదే గ్రామానికి చెందిన నీలం రవీందర్ అనే వ్యక్తి ధౌర్జన్యంగా భూని ఆక్రమించుకుంటు న్నాడని అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవా లని సీపీఐ కార్యదర్శి సిలివేరు దుర్గయ్య ఆరోపించారు. వాసాలమర్రి



లోని 183 సర్వేలో 2013-14 సంవత్సరంలో దళితులకు ఇండ్ల స్థలాలు కేటాయించారని అట్టి భూమిని పేద కుటుంబాలకు అన్యాయం చేస్తూ కబ్జా చేసుకోవడం మంచి పద్ధతి కాదని ఆయన మండిపడ్డారు. గత ఇరవై రోజుల కిందట బాధిత దళితకుటుంబాలు లక్ష్మపురం భిక్షపతి, చిన్నూరి పెంటయ్య, రామచంద్రం, దానయ్య, అండాలు, రమేష్ లు జిల్లా కలెక్టర్ కు, స్థానిక ఎమ్మార్వో కి పిర్యాదు చేసిన ఇంతవరకూ ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. అన్యాయం తమ ఇండ్లలోకి యంత్రా లతో వచ్చి గోడలు, ఇండ్లు కూలగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని స్థానిక పోలీసులకు పిర్యాదు చేసినాగాని పట్టించుకోలేదని, దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. దళితులకు అన్యాయం జరుగుతే ఊరుకునే ప్రసక్తిలేదని హెచ్చరించారు.

# ఓటరు జాబితా సవరణ చేయాలి

- దరఖాస్తులను పరిష్కరించాలి
- సమావేశంలో తహశీల్దార్లు కలెక్టర్ సూచన



భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): ఓటరు జాబితా సవరణలో భాగంగా ఫారం 6,7,8 దరఖాస్తులను పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జండగే తహసీల్దారులకు సూచించారు. గురు వారం నాడు కాన్ఫరెన్స్ హాలులో ఆయన తాసిల్దారు లతో సమావేశమై ఈనెల 16వ తేదీ వరకు వచ్చిన అన్ని రకాల దరఖాస్తులను పరిష్కరించాలని, ఒకే పోలింగ్ కేంద్రం లేదా ఒకే నియోజకవర్గంలో రెండు చోట్ల ఓట్లు ఉన్న వాటిని సరిచేయాలని, ఫోటోలలో తప్పులుంటే ఫారం 8 ద్వారా సరి చేయాలని, పోలింగ్ కేంద్రాల పేర్లు తప్పుగా ఉ ంటే సరి చేయడానికి ప్రతిపాదనలు పంపాలని, ఈనెల 31 తేదీలోగా



ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని రకాల టీముల వివరాలను సిద్ధం చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, వివిధ మండలాల తహశీల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయితీలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి ఆదేశాలు జారీ
- అధికారుల సమావేశంలో వెల్లడి



భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీల కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని జిల్లా



స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి సూచించారు. గురువారం నాడు ఆయన తన ఛాంబర్ లో జిల్లా పంచాయతీ అధికారి సునంద, డివిజనల్ పంచాయతీ అధికారులు సాధన, యాదగిరి, మండల పంచాయతీ అధికారులతో సమావేశమై గ్రామ పంచాయతీల కార్యకలా పాలను సమీక్షించారు. జనవరి చివరిలోగా 85 శాతం హౌస్ టాక్స్ వసూలు చేయాలని, ట్రాక్టర్ రుణాలు, సిసిచార్జెస్ పెండింగ్ ఉంచొద్దని, గ్రామ పంచాయతీల ఆడిట్ అభ్యంతరాలపై సమాధానాలు వ్రాయాలని, గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు పెండింగ్ ఉండొద్దని, గ్రామ పంచాయతీల కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచిం చారు.

# పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెరగాలి

- పాఠశాల ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ జెడెంగే హనుమంతు కొడింబా ఆదేశాలు జారీ



భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జండగే సూచించారు. గురువారం నాడు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో భువనగిరి కేంద్రీయ విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని కేంద్రీయ విద్యాలయ



కార్యకలాపాలను పిపిటి ద్వారా వీక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థుల పురోగతిని తెలుసుకున్నారు. అదనపు తరగతులు నిర్వహించి పదవ తరగతి పరీక్షలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులను వచ్చే జనవరిలోగా పూర్తి చేయాలని సూచించారు. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ చంద్రమౌళి, నేషనల్ ప్రాజెక్ట్ కన్స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి భరత్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరిధర్, మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారుల సమీక్షా సమావేశం

- విధుల నిర్వహణలో పటిష్టంగా పని చేయండి
- పోలీసు అధికారులకు ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపీఎస్ దిశానిర్దేశం
- అలవాటుగా నేరాలకు పాల్పడితే పిడి యాక్ట్ తప్పదు
- గంజాయి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్, యాంటీ నార్కోటిక్ కమిటీలు ఏర్పాటు

సూర్యాపేట జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): జిల్లా పోలీసు కార్యాలయం నందు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపీఎస్, అదనపు ఎస్పి నాగేశ్వరరావు తో కలసి కలిసి డిఎస్పీ లు, సిఐలు, ఎస్ఐ లతో కేసుల నమోదు, దర్యాప్తు పై సమీక్షా సమావేశం నిర్వహించారు.పోలీసు అధికారులు, సిబ్బంది విదుల నిర్వహణ, కేసుల నమోదు లో లోపాలు లేకుండా పటిష్టంగా ప్రణాళిక ప్రకారం పని చేయాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో నమోదౌవుతున్న కేసుల యొక్క తీరుతెన్నులు, కేసుల స్థితిగతులు, పెండింగ్ కేసుల దస్త్రాలు, కేసుల ఆన్లైన్ నమోదు, పోలీసు పని విభాగాల నిర్వహణ, ఎన్ఫోర్స్మెంట్ ను పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న ప్రతి కేసు రికార్డు ను పరిశీలన చేసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నివారణ, కేసుల దర్యాప్తులో కొత్త పద్ధతులు, అధునాతన సాంకేతికత అందు బాటులో ఉన్నాయి, వనరులను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన దర్యాప్తు చేయాలని అన్నారు.గంజాయి నిర్మూలనలో భాగంగా విద్యాసంస్థలు ల్లో, కమ్యూనిటీ ఏరియాల్లో యాంటీ నార్కోటిక్ కమిటీలు ఏర్పాటు చేయాలి దీనికి సంభందించి విద్యాసంస్థలకు సమాచారం ఇవ్వాలి, ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలో గంజాయి నిర్మూలన అంశంపై ప్లెక్సీలు పెట్టించాలి అని తెలిపినారు. జిల్లాలో గంజాయి లేకుండా గంజాయి రహిత జిల్లాగా చేయడానికి ఎక్కువగా ఫోకస్ చేయాలి, క్షేత్ర స్థాయిలో నిఘా ఉంచాలి, సమాచారం ఇచ్చే వనరులను




బలోపేతం చేసుకోవాలి అని తెలిపారు. గంజాయి, నార్కోటిక్ పదార్థాల నివారణకు జిల్లా నార్కోటిక్ పదార్థాల నిరోధక కమిటీ తో సమన్వయం తో పని చేయాలని సూచించారు. గతంలో గంజాయి సరఫరా చేసిన వారిపై, గంజాయి వినియోగించిన వారిపై నిరంతర నిఘా ఉంచి కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలిపారు. అక్రమ రవాణా, అక్రమ కార్యకలా పాలు జరగకుండా చూడాలి అన్నారు. గంజాయి నిర్మలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, గంజాయి రవాణా, సరఫరా, విని యోగం పై పోలీసు, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. జిల్లాలో ఉన్న పాత నేరస్తులు, అక్రమవ్యాపారులు, అలవాటు గా నేరాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారిచేసినారు. పోలీసు ఫంక్షన్ వర్టికల్ పని విభాగాలను సమర్ధవంతంగా నిర్వహించాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేసి కోర్టుకు పంపాలని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ పెంచి అక్రమ కార్యకలాపాలను కట్టడి చేయాలని అన్నారు. విజువల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు చేరువై స్నేహపూర్వక పోలీసు విధానం తో ప్రజలకు అందుబాటులో ఉండాలి అన్నారు. ప్రతి పిర్యాదు పై స్టేషన్ హౌజ్ అధికారి స్వయంగా బాదితునితో మాట్లాడాలి, పిర్యాదులపై వేగంగా స్పందించాలి, పెట్రోకార్, బ్లూ కొట్స్ సిబ్బంది సేవలను సమర్థవంతంగా వినియోగించాలి అని తెలిపారు. డిఎస్పీ లు, సిఐ లు ప్రతి అంశంపై నిరంతర పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి నాగేశ్వరరావు, డిఎస్పీ లు నాగభూషణం, ప్రకాష్, డిసిఆర్బి డిఎస్పీ రవి, సైబర్ సెక్యూరిటీ డిఎస్పీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాజేష్, మహేష్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ నాగార్జున, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, ఎస్ఐ లు, డిసిఆర్బి ఐటి కోర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠా అరెస్ట్

**- నలుగురిపై కేసు నమోదు రిమాండ్ కి తరలింపు**




సూర్యాపేట జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): జిల్లా కేంద్రంలో గంజాయి అమ్ముతూ, తగుతున్న ముఠా అరెస్ట్ చేసి, రిమాండ్ కి తరలించారు. వివరాల్లోకి వెళ్లితే గురువారం ఉదయం 06 గంటల సమయంలో సూర్యాపేట పట్టణములోని ఈనాడు ఆఫీస్ దగ్గర ముగ్గురు వ్యక్తులు గంజాయి తాగుతూ ఉండగా, అలాగే మరొక వ్యక్తి గంజాయిని అమ్ముతుండగా వారిని సూర్యపేట పట్టణ ఇన్స్పెక్టర్ జి.రాజశేఖర్, ఎస్ఐ రవీందర్, వారి సిబ్బంది అందరమూ కలిసి వారిని, వారివద్ద ఉన్న 100 గ్రాముల గంజాయితో యుక్తముగా పట్టుబడి చేసి, వారిని ఈరోజు జైక్ కు స్వాధీనం చేసుకుని రిమాండ్ కి తరలించనైనది. ఇకమీదట ఎవరైనా గంజాయి అమ్మినా, తాగినా వారిపై చట్టరిత్యా కఠినచర్య తీసుకోబడునని హెచ్చరించారు. పట్టుబడిన నేరస్తుల వివరములు 1. షేక్ నసీర్ ఏ డాన్ నసీర్ ఏ నాసిర్ బాబా తండ్రి షకీల్, వయసు: 30 సం.లు, కులము: ముస్లిం, వృత్తి : పెయింటింగ్, నివాసము: కొత్తగూడెం బజార్, సూర్యాపేట పట్టణము, 2.బవర్ రోహిత్ తండ్రి ఏ గుడ్డు తండ్రి సునిల్, వయసు:21 సం,,రాలు, కులము: మేతరి, వృత్తి : స్కావెంజర్, నివాసము: వెంకన్నబావి బజార్, సూర్యాపేట పట్టణము 3.దోరేపల్లి శివకుమార్ వయసు:21 సం,,రాలు, కులము: గౌడ, వృత్తి : ఎలక్ట్రిషన్, సూర్యాపేట పట్టణము మరియు 4. జాదవ్ విటల్ , నివాసము: ఎన్ టి ఆర్ కాలనీ, సూర్యాపేట్ పట్టణము మరియు మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఇక మీదట ఎవరైనా గంజాయి అమ్మినా, తాగినా వారిపై చట్టరిత్యా కఠినచర్య తీసుకోబడునని హెచ్చరించారు.

# అక్రమార్కులకు వరంగా మారుతున్న భూదాన్ భూములు

**- చేతులు మారి వెంచర్లుగా భూధాన్భూములు**
**- ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దు**
**- చెప్పే అధికారులే రియల్టర్లకు అండగా నిలిచిన వైనం**



దేవరకొండ, డిసెంబర్ 21(తీన్మార్ న్యూస్): దేవరకొండ నియోజకవర్గం, చింతపల్లి మండలంలోని కుర్మేడ్ గ్రామంలోని 247 సర్వే నం లోని భూదాన్ భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. గత పాలకులు అధికారంలో ఉండడంతో పలువురు రియల్టర్లు అధికారుల అండదండలతో రికార్డులనే తారుమారు చేశారు. ఆచార్య వినోబాలే ఈ మండలంలో పర్యటించిన సందర్భంలో కొందరు పేద రైతులకు భూములను దానంగా ఇచ్చారు. ఇందులో భాగంగా సర్వేనెంబర్ 247లో సుమారు 10 ఎకరాల భూమిని పేదలకు పంచారు. ఈ సర్వే నెంబర్లు భూదాన్ భూములు ఉన్నాయని ధరణి వెబ్సైట్లో కనిపించకుండా నిషేధిత జాబితాలో చేర్చారు. ధరణి ప్రవేశపెట్టకముందే ఐదారేళ్ళ క్రితం ఈ సర్వే నంబర్ లోని రెండు ఎకరాలను మరొకరికి అమ్మేందుకు యత్నించారు. కానీ రెవెన్యూ రికార్డుల్లో భూదాన్ భూములుగా నమోదు కావడంతో క్లియరెన్స్ ఇచ్చేందుకు అప్పటి తహసిల్దారు ఒప్పుకోలేదు. దీంతో పలువురు రైతులు కోర్టును ఆశ్రయించారు. అప్పటినుంచి ఈ వివాదం పెండింగ్లో ఉంది, తాజాగా ఈ భూములను కాజేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించిన రియాల్టర్లు గత అధికార పార్టీ ముఖ్య నేతల అండదండలతో రెవెన్యూ ఆఫీసర్లపై ఒత్తిడి తెచ్చి రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆఫీసర్లు ఒప్పుకోకపోవడంతో రియల్ టర్లు తమ పలుకుబడిని ఉపయోగించి ఈ సర్వే నెంబర్ గురించి సీసీఎల్ లో ఎంక్వయిరీ చేయించారు. భూదాన్ భూములు ఉన్నాయని చూపిస్తున్న వాటికి సంబంధించిన సర్వే నంబర్ సీసీఎల్ రికార్డుల్లో లేకపోవడంతో పథకం ప్రకారం అక్కడి నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తెప్పించారు దీని ఆధారంగా ఫైల్ ను చింతపల్లి తహసిల్దార్ ఆఫీస్ నుంచి కలెక్టర్కు పంపించారు, సీసీఎల్ఏ నుంచి ఎన్ఓసి ఉండడంతో 247 సర్వే నెంబర్లు రిజిస్ట్రేషన్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఆ భూముల్లో రియాల్టర్లు భారీ స్థాయిలో వెంచర్లు చేశారు. ఈ భూములు హైదరాబాద్ నాగర్జున సాగర్ ప్రధాన రహదారి కూడలి ఆనుకొని ఉన్న కురుమేడులో ప్రస్తుతం ఎకరం భూమి మూడు కోట్లు పలుకుతుంది, దాదాపు 20 కోట్ల విలువైన భూదాన్ భూములు రైతులను మభ్యపెట్టి తక్కువ ధరలకు కొనుగోలు చేసి కొందరు రియేటర్లు కోట్లు గడిస్తున్నారు. ఈ తతంగం అంతా నియోజక వర్గస్థాయి మాజీ ప్రజా ప్రతినిధి అండదండలతో భూధాన్ భూములు వెంచర్లు చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి భూముల్లో ప్రజలు ప్లాట్లను క్రయవికాయాలు జరిపి మోసపోవద్దని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భూదాన్ భూములలో అక్రమ వెంచర్లను తొలగించి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టకుండ రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న తెలంగాణ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు చెరుకు రమేష్

జవహర్ నగర్, డిసెంబర్ 21( తీన్మార్ ప్రతినిధి): పేదవారిని ఆదుకోవడం చాలా సంతోషంగా ఉందని ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా ఏదో ఒక సాయం అందించాలని హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు రమేష్ చెప్పారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ కార్పొరేషన్ వికలాంగుల కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ కౌసల్య పెండ్లికి పెద్ద మనసుతో పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు చెరుకు రమేష్ అందించారు. ప్రతి ఒక్కరూ సేవా భవాని అలవర్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి, పరమేశ్వరి, హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు నర్సింగరావు, శ్రీనివాస్, యాదగిరి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



# లిఫ్టుల నిర్వహణపై రైతుల ఎదురుచూపులు

నడిగూడెం,: సాగర్ ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఎడమ కాల్వపై ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి అప్పట్లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎడమ కాల్వ పరిధిలో 42 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. వీటి కింద 90 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. లిఫ్టులు నిర్మించిన నాటి నుంచి ప్రభుత్వమే పూర్తి స్థాయిలో నిర్వహించింది. అప్పటి తెదేపా ప్రభుత్వంలో లిఫ్టుల నిర్వహణ బాధ్యతను లిఫ్ట్ కమిటీలకు అప్పగించి, వీటిని నిర్వహిస్తున్న నీటిపారుదల అభివృద్ధి సంస్థను రద్దు చేశారు. అప్పటి నుంచి లిఫ్టులు రైతుల పాలిట గుదిబండలుగా మారాయి.

రైతుల మధ్య సమన్వయ లోపం, సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో లిఫ్ట్ నిర్వహణ తమ వల్ల కాదని రైతు కమిటీలు చేతులెత్తేశాయి. ఉద్యమ కాలంతో పాటు, ప్రభుత్వం ఏర్పడిన రెండు పర్యాయాలు తాము అధికారంలోకి వస్తే ఎడమ కాల్వపై ఉన్న ఎత్తిపోతల పథకాలను పూర్తి స్థాయిలో ప్రభుత్వమే నిర్వహిస్తుందని అప్పటి సీఎం కేసీఆర్ పలు మార్లు హామీ ఇచ్చారు. దశాబ్ద కాలం పూర్తయినా హామీ నెరవేరలేదు. రైతు కమిటీ నేతల ఆందోళన మేరకు వీటిని సాగర్ ఆధునీకరణ ప్రాజెక్టులో చేర్చి, పూర్తి స్థాయిలో ఆధునీకరించారు. వీటి పర్యవేక్షణ బాధ్యతను ఎన్నెస్పీ శాఖకు అప్పగించి నిర్వహణను చేపట్టకపోవడంతో రైతులు రెండేళ్ల నుంచి భారంగా నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల నిర్వహణ లోపంతో లిఫ్టులు మూతపడే దశకు చేరుకున్నాయి. పూర్తి స్థాయిలో నిర్వహణ చేపట్టకపోవడంతో స్థిరీకరించిన ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్ల వ్యయం చేసి ఎత్తిపోతలను ఆధునీకరించినా, వాటి నిర్వహణ బాధ్యతను చేపట్టకపోవడంతో రైతులకు ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. ఎడమ కాల్వ పరిధిలోని ఎత్తిపోతల పథకాల నిర్వహణకు సిబ్బంది, నిర్వహణ ఖర్చులు ఏ మేరకు అవసరమవుతాయోనని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేసి అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదించారు.



ఏళ్లు గడిచినా అది కార్యరూపం దాల్చలేదు. ప్రతి లిఫ్ట్ పరిధిలో ఆపరేటర్‌తో పాటు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యక్తిని నియమించేందుకు ఎంత వ్యయం వస్తుందనే అంచనాలను సిద్ధం చేసి ప్రభుత్వ పరిశీలనకు పంపారు. అది కార్యరూపం దాల్చలేదు. నూతన ప్రభుత్వమైనా సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని లిఫ్టల నిర్వహణ బాధ్యతను చేపట్టాలని ఆయకట్టు పరిధిలోని రైతులు కోరుతున్నారు.

కుడి కాల్వ పరిధిలోని ఎత్తిపోతల పథకాలను ఎప్పటి నుంచో ప్రభుత్వమే నిర్వహిస్తోంది. ఎడమ కాల్వ పరిధిలోని ఎత్తిపోతల పథకాలను కూడా ప్రభుత్వమే పూర్తిస్థాయిలో నిర్వహించి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. లిఫ్టల నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వమే నిర్వహించేందుకు ఎంత మంది సిబ్బంది అవసరం, వేతనాలు,

నెలవారీ నిర్వహణ వ్యయం తదితర వివరాలకు సంబంధించి పూర్తి స్థాయి అంచనాలను ప్రతిపాదించి గతంలో ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం ఎడమ కాల్వ పరిధిలో ఉన్న లిఫ్టల పరిధిలో ఆయకట్టుకు సాగునీరు అందేలా శాఖ తరఫున పర్యవేక్షణ చేస్తున్నాం.

# క్రీడారంగాన్ని విస్మరించిన వైకాపా ప్రభుత్వం

అనంతపురం:క్రీడారంగానికి అతికినట్లు సరిపోతుంది. నానాటికీ ప్రమాణాలు పడిపోవడానికి కారణం పాలకుల నిర్లక్ష్యమే. గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన క్రీడా విధానానికి పాతరేసిన వైకాపా సర్కారు.. కొత్త విధానం పేరిట కాలయాపన చేస్తోంది. నాలుగున్నరేళ్లలో క్రీడల కోసం ఏమి చేసిందో ప్రత్యేకంగా చెప్పుకోవడానికి ఏదీ లేదు. మౌలిక సదుపాయాలు కల్పించిన దాఖలాలు మచ్చుకైనా కనిపించవు. దీంతో అనంత క్రీడాకారులు వివిధ పోటీల్లో ప్రతిభ చాటలేకపోతున్నారు. వైకాపా ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో చిన్నచూపు చూస్తోంది. గతంలో ఏటా కొంతమేర బడ్జెట్ జిల్లా క్రీడాప్రాధికార సంస్థలకు కేటాయించేవారు. ఈ నిధులతో మండల, జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి గ్రామీణ యువత ప్రతిభను వెలుగులోకి తెచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి బడ్జెట్ విడుదల చేయలేదు. శాప్ ఆధ్వర్యంలో ఏడాది క్రితం సీఎం కప్ పోటీలు నిర్వహించిన వైకాపా సర్కారు.. ప్రస్తుతం ఆడుదాం ఆంధ్రా పేరిట ప్రచార ఆర్భాటం చేస్తోంది. ఇందుకు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతూ గ్రామీణ క్రీడలను పక్కనబెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం తెచ్చిన పే అండ్ ప్లే పథకంతో క్రీడారంగం నిర్వీర్యమైంది. డీఎస్ఏ (డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ) శిక్షకుల ద్వారా తర్ఫీదు పొందాలంటే ఆటను బట్టి నెలకు రూ.50 నుంచి 200 వరకు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. డబ్బు చెల్లించి నేర్చుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో శిక్షకులు కొందరు తమ జీతాల నుంచి చెల్లించారు. క్రీడాకారులతో డబ్బులు వసూలు చేయని శిక్షకులను సస్పెండ్ చేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రతి నెలా డీఎస్ఏ నుంచి రూ.10 వేల నుంచి 20వేల వరకు చెల్లించేవారు. క్రీడాకారుల సంఖ్య తగ్గడం, శాప్ ఎండీ మారిపోవడంతో కొన్ని ఆటలకే పరిమితం చేశారు. షటిల్, టీటీ, తైక్వాండో నేర్చుకునే వారి నుంచి ఇప్పటికీ వసూలు చేస్తున్నారు. తెదేపా ప్రభుత్వ హయాంలో జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు రవాణా ఖర్చులు ప్రభుత్వం చెల్లించేది. గత సర్కారు



హయాంలో రూపొందించిన క్రీడా విధాన ముసాయిదా ప్రకారం కొత్త అకాడమీల ఏర్పాటు, పోటీలకు వెళ్లే క్రీడాకారులకు రానుపోను ప్రయాణ ఛార్జీలు చెల్లించేవారు. ప్రస్తుతం ఒక్క పైసా ఇవ్వకపోవడం గమనార్హం. సంఘాలు, పాఠశాల క్రీడల పోటీల్లో పాల్గొనే వారు సొంత ఖర్చులతో వెళ్లివస్తున్నారు. ఇక పేదలు దూర ప్రయాణ ఛార్జీలు భరించలేక పోటీల నుంచి తప్పుకుంటున్నారు. ఏటా రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి అనంత జిల్లా నుంచి వెయ్యి మందికి పైగా పాల్గొంటున్నారు. రాయితీలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డీఎస్ఏ ద్వారా శిక్షణ ఇస్తున్న కొన్ని క్రీడలకు సంబంధించి ఫీజు వసూలు చేస్తున్నాం. కబడ్డీ, అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్‌కు లేదు. ఆరు నెలల నుంచి వసూలు చేయడం లేదు. ప్రస్తుతం సాధనకు వచ్చే క్రీడాకారుల సంఖ్య పెరిగింది. ప్రస్తుత ప్రభుత్వం క్రీడలపై పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. పే అండ్ ప్లే విధానం అమలుతో ఎంతో మంది క్రీడాకారులు కనుమరుగయ్యారు. గ్రామీణస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి.. శిక్షకులను నియమించాలి. సర్కారు ఎలాంటి సదుపాయాలు కల్పించలేదు. క్రీడల్లో మన రాష్ట్రం చాలా వెనుకబడి ఉంది. సీఎం కప్, ఆడుదాం ఆంధ్రా పోటీలతో పెద్దగా ఫలితం ఉండదు.

# మూలకు మగ్గాలు..మూగబోతున్న నేతన్నలు



పుట్టపర్తి :అత్యంత వెనుకబడిన శ్రీసత్యసాయి జిల్లాలో వ్యవసాయం తర్వాత చేనేత రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ రంగంలో గిట్టుబాటు లేకపోవడం.. కుటుంబపోషణ భారం, పిల్లల చదువులు, చేసిన అప్పులు తీర్చలేక, వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక చేనేత కార్మికులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. చేనేత కార్మికుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలను పరామర్శించడం, కొద్దిపాటి పరిహారం అందించి, చేతులు దులుపుకొంటున్నారు. చేనేత పరిశ్రమను ఆదుకోవడానికి వైకాపా నాలుగున్నరేళ్ల పాలనలో చేపట్టిన చర్యలు శూన్యం. ఆదుకోవాల్సిన ప్రభుత్వం మొండి చెయ్యి చూపిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 26 వేల మంది చేనేతలు ఉన్నారు. సంక్షోభంలో ఉన్న నేతన్నల బాధలు వర్ణనాతీతం, చాలామంది ఈ పని వదిలేసి ఇతర కూలీ పనుల వైపు మళ్లిపోతున్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి నాణ్యమైన పట్టుచీరలకు ప్రసిద్ధి చెందింది ధర్మవరం. అలాంటిది ఇక్కడ నేతన్నలు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకోవడం అందరినీ కలిచివేస్తోంది. ఒకప్పుడు పట్టు వస్త్రాలకు మంచి గిరాకీ ఉండేది. నేతన్న పడిన కష్టానికి మంచి ఆదాయం వచ్చేది. కానీ, నేటి పరిస్థితుల్లో కనీసం ఉపాధి దొరకడం కూడా ప్రశ్నార్థకమే. రోజుకు 6 గంటలపాటు వారం రోజులు మగ్గంపై కష్టపడితే గానీ ఓ చీర తయారీ కాదు. అలా తయారు చేస్తే తమకు మిగిలేది కేవలం రూ.3,500 లేనని నేతన్నలు చెబుతున్నారు. నేతన్నలకు ఇది తప్పితే మరో పని రాదు. మనసు చంపుకొని వేరే పనులకు వెళ్లినా అనుభవం లేదని కూలి తక్కువగా చెల్లిస్తారు. ఇంటిల్లిపాదీ ఆ మగ్గంపై వచ్చే ఆదాయంతోనే బతుకుతున్నారు. కరెంటు బిల్లులు, అవసరాలకు తీసుకున్న అప్పులు, బ్యాంకు రుణాలను సరైన సమయంలో కట్టేందుకు కూడా డబ్బులు లేక మనోవేదనకు గురౌతున్నారు. వచ్చిన తక్కువ ఆదాయంతో పిల్లల చదువులను, కుటుంబ బాధ్యతను మోయలేకపోతున్నారు, పనిచేసేటప్పుడు కాంతిలో ఎక్కువసేపు దారాన్ని చూస్తూ ఉండాలి. అందువల్ల కంటి చూపు మందగిస్తుంది. చాలామంది ఇలా కంటి చూపును కోల్పోతున్నారు. పవర్‌లూమ్ చీరలతో నష్టం: చేతి మగ్గంపై తయారు చేసే చీరకు ఎక్కువ ఖర్చు అవుతోంది. అందుకే తక్కువ పెట్టుబడితో తయారయ్యే పవర్‌లూమ్ చీరలను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నారు వీవర్లు. దీంతో చేతి మగ్గాలకు డిమాండ్ తగ్గిపోయింది. గతంలో శ్రీసత్యసాయి జిల్లాలో పుట్టపర్తి, ధర్మవరంలోని క్లస్టర్లను 3 ఏళ్ల కాలపరిమితి దాటిందని మూసివేశారు. వాటి ద్వారా ఎంతో మందికి శిక్షణను ఇచ్చి యంత్రాలను కూడా ఇచ్చేవారు. కేంద్ర పరిధిలోని ఈ ప్రాజెక్టులో వీవింగ్, డిజైన్, డైయింగ్‌పై శిక్షణనిస్తూ, రోజుకు రూ.210 స్టైఫండ్ కూడా చెల్లించేవారు. శిక్షణ ముగిశాక 90 శాతం రాయితీతో యంత్రాలు ఇచ్చేవారు. ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

# పంటల దిగుబడిపై దిగులు

ఉరవకొండ :వర్షాభావంతో హెచ్ఎల్సీకి తుంగభద్ర జలాల సరఫరా ఆగిపోయింది. అనుబంధంగా సాగే గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ)లో నీటి ప్రవాహం నిలిచిపోయింది. ఈ కాలువ కింద 32 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. సింహభాగం మిరప పంటదే. ప్రస్తుతం పిందె దశలో ఉండటంతో నీటి తడులు అవసరం. వర్షాలు రాకపోయినా తుంగభద్ర నీటితో ఇన్నాళ్లూ రైతులు పంటను కాపాడుకున్నారు. మరో నెల రోజులు నీరందిస్తే వేల ఎకరాల్లో మిరపతో పాటు ఇతర పంటలు చేతికి అందే అవకాశం ఉంది. జీబీసీకి ప్రత్యామ్నాయంగా కృష్ణా జలాలను తరలించడానికి వీలుంది. హంద్రీనీవా ఉపకాలువ ద్వారా ఉరవకొండ మండలం నింబగల్లు వద్ద జలాలను జీబీసీలో కలపడానికి మార్గం ఉంది. ఏడు కి.మీ కాలువ, మరో ఏడు కి.మీ వంక ద్వారా కృష్ణా జలాలు కలుస్తాయి. ప్రత్యామ్నాయ కాలువలో ముళ్లకంపలు పెరిగాయి. వాటిని తొలగిస్తే నీరు సులభంగా అక్కడికి చేరుతుంది. ప్రస్తుతం హంద్రీనీవాలో ప్రవాహం ఆశాజనకంగా సాగుతోంది. తుంగభద్ర జలాలు ఆగిపోతాయని అధికారులు రెండు నెలలుగా ప్రకటిస్తూనే వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టే దిశగా వైకాపా సర్కారు చొరవ చూపలేదు. దీంతో వేలాది ఎకరాల్లో పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత పరిస్థితులే 2016లోనూ ఉండేవి.



నవంబరులోనే తుంగభద్ర జలాలు ఆగిపోయాయి. ఆ సమయంలో కృష్ణా జలాలను తరలించడానికి అప్పటి ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ అధికారులను సంప్రదించారు. నీటిని తరలించడానికి సాధ్యం కాదని చెప్పారు. ఈక్రమంలో ప్రైవేటుగా సర్వే చేయించి, నీటిని తరలించవచ్చని నిర్ధారణకు ఇచ్చారు. ఏడు కి.మీ మేర సొంత ఖర్చుతో కాలువ తవ్వించి.. కృష్ణా జలాలను జీబీసీకి సరఫరా చేయించి పంటలు కాపాడారు. ప్రస్తుతం ఆ నీటిని తరలించడానికి ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా పాలకులు పట్టించుకోవడం లేదు.

# పరిహారంపై కాకి లెక్కలు

గూడూరు: వరదలో ఇళ్లు కూలిన వారికి సాయానికి దిక్కులేదు. దెబ్బతిన్న ఉద్యాన పంటలు లెక్కల్లోకి ఎక్కించలేదు. కళ్ల ముందే పొలాలపై ఇసుక మేటలేసినా దయలేని పరిస్థితి. తీర ప్రాంతాల్లో మోటార్లు కొట్టుకుపోయినా లెక్కలేదు. ఇదీ పరిహారం లెక్కల కహానీ. పునరావాస కేంద్రాల్లో అరకొర అన్నం పెట్టి చేతులు దులుపుకొని.. ప్రాథమికంగా పంట నష్టాలు గుర్తించడంపై ప్రజలు ఆగ్రహావేశాలతో ఉన్నారు. కనీసంగా పలకరింపు కరవైందని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో తుపాన్ ప్రభావం 29 మండలాలు, 546 గ్రామాలపై పడిందని అధికారిక లెక్కలు కాగా 84 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఇక్కడ 6478 మందికి ఆశ్రయమిచ్చినట్లు చెబుతున్నారు. బాధితులకు రూ.వెయ్యి నుంచి రూ.2500 ఇచ్చినట్లు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అటు ముఖ్యమంత్రి జగన్ నుంచి కింది స్థాయి అధికారుల్లో పక్కా లెక్కల ప్రణాళిక లేకుండా ఉంది. వరదల సమయంలో దెబ్బతిన్న ఇళ్లెన్ని.. వాణిజ్య, ఉద్యాన పంటల నష్టం వివరాలు సేకరించనే లేదు. ఇందుకు కొన్ని గ్రామాల్లో బాధితులే సాక్ష్యం. కేవీబీపురం మండలం కళత్తూరు ఎస్సీకాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం మూడు ఎకరాల్లో వేసిన వేరుసెనగ పంట మొత్తం కొట్టుకుపోయింది. మూడు ఎకరాల్లో రాళ్లు, ఇసుక మేటలు వేసింది. బోరు పూడిపోగా, స్టార్టర్, విద్యుత్ వైర్లు వరదల్లో కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు రూ.రెండు లక్షల వ్యయం చేశాడు. ఈ పంట భూమిని బాగు చేసుకోవాలంటే రూ.రెండు లక్షలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. రబీ 2023లో ఈ- పంట చాలా తక్కువగా నమోదైంది. ఇదే నిబంధన ఉంటే జిల్లాలో నష్టపరిహారం వేళ్ల మీద లెక్కించాల్సిందే.

## ఇథనాల్‌లో చెరకుకు ' నో '..
# షుగర్ ధరల నియంత్రణకు నిర్ణయం

ఇథనాల్ తయారీలో చెరకు రసం ఉపయోగించవద్దని కేంద్ర ప్రభుత్వం చక్కెర మిల్లులు, డిస్టిలరీలను కోరింది. ఈ మేరకు కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ చక్కెర మిల్లులకు, డిస్టిలరీలకు లేఖ రాసింది. దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలను అదుపు చేసేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. చెరకు ప్రధానంగా పండించే రాష్ట్రాల్లో ఈ సారి సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో దిగుబడి తగ్గింది. దీంతో చక్కెర ధరలు పెరుగుతాయని భావిస్తున్నారు. దీంతో దేశీయంగా షుగర్ అందుబాటులో ఉం డేలా చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇథనాల్ తయారీకి చెరకు రసాన్ని, షుగర్ సిరప్ వాడకాన్ని నిలిపివేయాలని కేంద్రం ఈ లేఖలో కోరింది. బి-హెవీ మొలాసిస్‌కు మినహాయింపు ఇచ్చింది. ఆయిల్ మార్కెట్ కంపెనీలకు బి-హెవీ మోలాసిస్ నుంచి తీసిన సప్లయ్ కొనసాగుతుందని కేంద్రం స్పష్టం చేసింది.దేశంలో డిమాండ్-సప్లయ్ తీరును పరిశీలించిన మంత్రుల కమిటీ దీనిపై నిర్ణయం తీసుకుంది. ఈ సంవత్సరం ప్రధానంగా షుగర్ ఉత్పత్తిపై ఎక్కువ కేంద్రీకరించాలని కమిటీ నిర్ణయించింది. షుగర్ మిల్లులకు కేవలం సీ-హెవీ మోలాసిస్‌ను ఉత్పత్తి చేసేందుకు మాత్రమే అనుమతి ఇచ్చింది. 2023-24 సంవత్సరం ఇథనాల్ సేకరణ ఈ నవంబర్ 1 నుంచి ప్రారంభమైంది. తాజాగా కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులతో దీన్ని సమీక్షించనున్నారు. చమురు కంపెనీలతో ఒప్పటికే కుదుర్చుకున్న ఒప్పందాలు కొనసాగుతాయి. ఇథనాల్ ఉత్పత్తిని



భారీగా పెంచేందుకు కొన్ని సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయని, తాజా నిర్ణయంతో ఈ కంపెనీలకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఇది తాత్కాలికంగానే ఉండే అవకాశం ఉందని, చెరకు ఉత్పత్తి పెరిగితే మళ్లీ ఇథనాల్ ఉత్పత్తికి కేంద్రం అనుమతి ఇవ్వొచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. 2023-24 సంవత్సరంలో షుగర్ ఉత్పత్తి 8 శాతం వరకు తగ్గి 33.7 మిలియన్ టన్నులు వచ్చే అవకాశం ఉందని ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్ తెలిపింది. 14 సంవత్సరాల తరువాత దేశంలో షుగర్ ఉత్పత్తి తగ్గనుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

## ఆ విపత్తును అడ్డుకోండి.. అసాధారణ
# అధికారాన్ని వినియోగించిన ఐరాస చీఫ్!

గాజాపై ఇజ్రాయెల్ చేస్తోన్న ప్రతిదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 16వేలు దాటినట్లు నివేదికలు చెబుతున్నాయి. దీనిపై ఐక్యరాజ్యసమితితీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో అసాధారణ అధికారాలను వినియోగించేందుకు సిద్ధమైంది. గాజాలో మానవతా సంక్షోభ నివారణకు భద్రతా మండలిచర్యలు చేపట్టాలని కోరుతూ యూఎన్ ఛార్టర్‌లోని ఆర్టికల్ 99ను వినియోగించాలని నిర్ణయించింది. గాజాపై ఇజ్రాయెల్ దళాలు దాడులు మరింత తీవ్రతరం చేసిన నేపథ్యంలో ఐరాస చీఫ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 'ఐరాస చీఫ్‌గా ఎన్నికైన తర్వాత తొలిసారిగా ఐరాస చార్టర్‌లోని ఆర్టికల్ 99ను అమలు చేస్తున్నా. గాజాలో మానవతా వ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం నెలకొన్న వేళ.. ఆ విపత్తును నివారించడానికి భద్రతా మండలి సహాయం చేయాలని కోరుతున్నా. దీంతోపాటు మానవతావాద కాల్పుల విరమణను ప్రకటించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పేర్కొన్నారు. ఐరాసలోని ఆర్టికల్ 99 అనేది సెక్రటరీ జనరల్ చేతిలో ఉన్న స్వతంత్ర సాధనంగా పేర్కొంటారు. దీని ప్రకారం, ప్రపంచ శాంతి, భద్రతా నిర్వహణకు ముప్పుగా పరిగణించే ఏ విషయాన్నైనా భద్రతా మండలి దృష్టికి ఐరాస చీఫ్ తీసుకెళ్లొచ్చు. ఈ ప్రత్యేక అధికారంతో అంతర్జాతీయంగా ఆందోళనలను కలిగించే పరిస్థితుల్లో భద్రతా మండలిని సమావేశపరచవచ్చు. ఇజ్రాయెల్ భద్రతా దళాలు, హమాస్ మిలిటెంట్ల మధ్య కాల్పుల విరమణపై శక్తివంతమైన భద్రతామండలి ఎటువంటి తీర్మానాలు ఆమోదించని నేపథ్యంలో ఐరాస చీఫ్ ఈ ఆర్టికల్ ప్రయోగానికి సిద్ధమయ్యారు. ఒకవేళ ఐరాస చీఫ్ సూచనలకు అనుగుణంగా కాల్పుల విరమణ



చేయాలంటూ ఉభయ పక్షాలను కోరుతూ భద్రతా మండలి ఏదైనా తీర్మానాన్ని ఆమోదిస్తే.. ఆ ప్రాంతంలో శాంతిస్థాపనకు వివిధ మార్గాలను అనుసరిస్తారు. అంతర్జాతీయ బలగాలను మోహరించడం, ఒకటి లేదా రెండు పక్షాలపై ఆంక్షలు విధించడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇదిలాఉంటే, గాజాలో ఉన్న హమాస్ బెటాలియన్ కమాందర్లలో సగానికిపైగా మృతిచెందారని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. మొన్నటివరకు ఉత్తర గాజాలో భీకర దాడులు చేసిన ఐడీఎఫ్.. ప్రస్తుతం దక్షిణ గాజాలోనూ దాడులను తీవ్రతరం చేసింది. దీంతో పాలస్తీనియన్లు తలదాచుకునేందుకు సురక్షిత చోటు లేకుండా పోయింది. ఇలా గాజాలో మానవతా పరిస్థితులు క్షీణిస్తుండటంపై ఐక్యరాజ్యసమితి చీఫ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విపత్తును అడ్డుకునేందుకు ఐరాస భద్రతా మండలి చర్యలు చేపట్టాలని సూచించారు.

## బాలికల విద్యను నిషేధిస్తే ప్రజలకు
# మనం దూరమవుతాం..ఒప్పుకున్న తాలిబన్లు




ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ల పాలన రాగానే అక్కడ బాలికల విద్యను నిషేధించారు. ప్రజలు తాలిబాన్‌లకు దూరంగా ఉండటానికి ప్రధాన కారణం మహిళల విద్యపై నిరంతర నిషేధమని డిప్యూటీ విదేశాంగ మంత్రి షేర్ మహ్మద్ అబ్బాస్ స్టానిక్‌జాయ్ అన్నారు. ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ 6వ తరగతి నుండి బాలికల కోసం పాఠశాలలను పునఃప్రారంభించడం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. జ్ఞానం లేని సమాజం అంధకారమని అన్నారు. విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌కు గుర్తుగా గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ వేడుకను నిర్వహించింది. స్టానిక్‌జాయ్ మాట్లాడుతూ.. "ఇది ప్రతి ఒక్కరి హక్కు, ఇది దేవుడు, ప్రవక్త వారికి ఇచ్చిన సహజ హక్కు, ఎవరైనా ఈ హక్కును వారి నుండి ఎలా తీసివేయగలరు? ఎవరైనా ఈ హక్కును ఉల్లంఘిస్తే అది ఆఫ్ఘన్ల పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. అందరికీ విద్యా సంస్థల తలుపులు తిరిగి తెరవడానికి ప్రయత్నించండి. ఏ దేశమైనా మనకు దూరమై, మనతో కలత చెందుతుంటే, దానికి అతిపెద్ద కారణం విద్య" అన్నారు. తాలిబన్లు నియమించిన సరిహద్దు.. గిరిజన వ్యవహారాల తాత్కాలిక మంత్రి నూరుల్లా నూరి మాట్లాడుతూ.. విద్య అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న యువత పాఠశాలల్లో చేరారని అన్నారు. తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరో తరగతి పైబడిన బాలికల చదువుకు దూరమయ్యారు. తాలిబాన్ నియమించిన తాత్కాలిక విద్యా మంత్రి హబీబుల్లా అగా ఇటీవల దేశంలోని మతప రమైన పాఠశాలల్లో నాణ్యమైన విద్యను విమర్శించినట్లు టోలో న్యూస్ నివేదించింది. హబీబుల్లా అగా తాలిబాన్‌లు, మత పండితులు విద్య నాణ్యతను మెరుగుపరచడంపై తీవ్రమైన శ్రద్ధ వహించాలని కోరారు.

# బాగ్దాద్ యూఎస్ ఎంబసీపై రాకెట్లతో దాడి..



తెల్లవారుజామున బాగ్దాద్‌పై రాకెట్లతో దాడి జరిగింది. ముఖ్యంగా ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో ఉన్న అమెరికన్ రాయబార కార్యాలయాన్ని టార్గెట్ చేసుకుని మూడు రాకెట్లను ప్రయోగించారు. ఇవి డిస్ట్రిక్ట్ హౌసింగ్ గవర్నమెంట్, దౌత్య భవనాలకు దూరంగా పడినట్లు ఇరాక్ భద్రతా అధికారి తెలిపారు. అయితే ఈ రాకెట్లతో దాడి ఎవరు చేశారనే దానికి ఇప్పటి వరకు ఎవరూ బాధ్యత వహించలేదు. అక్టోబర్ ప్రారంభంలో ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం ప్రారంభం తర్వాత మిడిల్ ఈస్ట్ దేశాల్లో ఉద్రిక్తతలు ఏర్పాడ్డాయి. ఇజ్రాయిల్‌కి అమెరికా మద్దతు నిలుస్తుండటం అక్కడి ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూపులకు నచ్చడం లేదు. దీంతోనే అమెరికాను టార్గెట్ చేసి దాడులు చేశారని తెలుస్తోంది. అక్టోబర్ మధ్య నుంచి ఇరాక్, సిరియాలోని ఇతర ప్రాంతాల్లో అమెరికన్, సంకీర్ణ దళాలపై ఇరాన్ అనుకూల శక్తులు రాకెట్లు, డ్రోన్ దాడులకు పాల్పడ్డాయి. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులను నిరోధించేందుకు ఇరాక్‌లో దాదాపుగా 2500 మంది, సిరియాలో 900 మంది యూఎస్ సైనికులు ఉన్నారు.గత వారం ఇజ్రాయిల్-హమాస్ సంధి ఒప్పందం ముగియడంతో ఇరాన్ మద్దతు ఉన్న హమాస్, హిజ్బుల్లా వంటి ఉగ్రవాద సంస్థలు అమెరికా, సంకీర్ణ బలగాలపై దాడులకు పాల్పడుతున్నాయి. అయితే ఈ దాడులు ఇరాక్ లోని ఇస్లామిక్ రెసిస్టెన్స్ అనే గ్రూపు బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది. ఈ దాడులకు వ్యతిరేకంగా యూఎస్ దళాలు ఇరాన్, సిరియాల్లోని పలు లక్ష్యాలపై దాడులు చేశాయి. ఇరాక్ ప్రధాని మహ్మద్ షియా అల్ సుడానీ, యూఎస్ విదేశాంగా కార్యదర్శి ఆంటోని బ్లింకెన్‌తో మాట్లాడిన తర్వాత రోజు అమెరికన్ ఎంబసీపై రాకెట్ దాడి జరగడం గమనార్హం.అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయిల్‌పై దాడి చేసి 1200 మందిని చంపింది. అంతేకాకుండా 240 మందిని బందీలుగా చేసుకుంది. ఇటీవల సంధి ఒప్పందంలో భాగంగా కొందరు బందీలను హమాస్ విడుదల చేస్తే.. ఇజ్రాయిల్ తమ జైళ్లలో ఉన్న పాలస్తీనియన్లు విడిచిపెట్టింది. అయితే సంధి ఒప్పందం ముగియడంతో మళ్లీ ఇజ్రాయిల్ బలగాలు గాజా స్ట్రిప్‌లో హమాస్ ఉగ్రసంస్థ లక్ష్యంగా దాడులకు పాల్పడుతోంది. ఈ యుద్ధం మొదలైన తర్వాత ఇజ్రాయిల్ దాడుల్లో 17 వేల మంది పాలస్తీనియన్లు మరణించారు.

## మందుబాబు మేలుకో.. 30ఏళ్ల
# నిషేధానికి తెర.. తాగేంత తాగేసెయ్


మణిపూర్ :ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ రాష్ట్రంలో మద్యపాన నిషేధానికి తెరపడింది. ఈ రాష్ట్రంలో దాదాపు 30 సంవత్సరాలుగా మద్యం అమ్మడం, త్రాగడం నిషేధించబడింది. అయితే ఇప్పుడు మణిపూర్‌లో మద్యం అమ్మకం, వినియోగం చట్టవిరుద్ధం కాదు. ఇష్టానుసారం ప్రజలు ఇప్పుడు మద్యం తాగేయవచ్చు. గ్రేటర్ ఇంఫాల్, జిల్లా ప్రధాన కార్యాలయం, పర్యాటక ప్రదేశాలలో ఇక నుండి మద్యం విక్రయించవచ్చు.. వినియోగించవచ్చు. అలాగే, రిజిస్టర్ చేయబడిన కనీసం 20 కంటే ఎక్కువ గదులు ఉన్న హొటళ్లకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వర్తిస్తుంది. 1991లో మణిపూర్‌లో మద్యపాన నిషేధం అమలులోకి వచ్చింది. 1991 నాటి ఆ ఉత్తర్వును ఇప్పుడు రాష్ట్ర గవర్నర్ ఉపసంహరించుకున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల రాష్ట్రానికి ఏటా కనీసం రూ.600 కోట్ల ఆదాయం వస్తుందని ఈ విషయంపై అవగాహన ఉన్న ఓ అధికారి తెలిపారు. మద్యం అమ్మడం లేదా తాగడంపై నిషేధం ఉన్న అన్ని రాష్ట్రాల్లో మద్యం ద్వారా భారీ ఆదాయాన్ని కోల్పోతున్నారు. దానికి బీహార్ ఉదాహరణ. అయితే, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మాత్రం మద్య నిషేధం నిర్ణయం సమాజ ప్రయోజనాల దృష్ట్యా అంటున్నారు. మణిపూర్‌లో మద్యపాన నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని సోమవారం నాడు నిర్ణయం



తీసుకున్నట్లు సమాచారం. ఆ రోజు ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో మద్యం అమ్మకాలు, వినియోగంపై నిషేధాన్ని ఎత్తివేయడానికి అంగీకరించారు. అయితే ఇప్పుడు దీనికి సంబంధించి గవర్నర్ ఉత్తర్వులు కూడా వచ్చాయి. ఈ విధంగా మద్యం వినియోగం ఇప్పుడు ఈ రాష్ట్రంలో చట్టబద్ధమైంది. మే నుంచి మణిపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇప్పుడు కూడా రాష్ట్రం నుండి అప్పుడప్పుడు హింసాత్మక నివేదికలు వస్తూనే ఉన్నాయి.

## భూమి నుంచి 2.5కి.మీ లోతులో
# ప్రయోగశాలను నిర్మిస్తోన్న డ్రాగన్ కంట్రీ ?

చైనా ప్రతిరోజూ నిత్యం కొత్త ప్రయోగాలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తూనే ఉంది. ఆ దేశం ఆకాశంలో మానవ నిర్మిత సూర్యుడిని సృష్టించడానికి ప్రయత్నిస్తోంది. అతను చంద్రునిపై స్థావరాలను ఏర్పాటు చేయడం గురించి ప్రయోగాలు చేస్తోంది. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత లోతైన ప్రయోగశాలను చైనా నిర్మించింది. దీని లోతు 2400 మీటర్లు అంటే భూమికి దాదాపు 2.5 కిలోమీటర్ల దిగువన ఉంది. చైనా కూడా ఈ ల్యాబొరేటరీలో పనిచేయడం ప్రారంభించింది. 'డార్క్ మ్యాటర్' కోసం భూమిలోపలికి వెళ్లిందని చైనా చెబుతోంది. డార్క్ మ్యాటర్ ఇప్పటికీ శాస్త్రవేత్తలకు మిస్టరీగా మిగిలిపోయింది. ప్రపంచం మొత్తం కృష్ణ పదార్థంతో నిర్మితమైందని నమ్ముతారు. డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీ కారణంగానే విశ్వం మొత్తం క్రమబద్ధంగా నిర్వహించబడుతుందని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. చంద్రుడు, నక్షత్రాలు, సూర్యుడు, గ్రహాల మధ్య సమన్వయం కూడా కృష్ణ పదార్థం కారణంగా ఉందని శాస్త్రవేత్తలు విశ్వసించారు. ఎందుకంటే మొత్తం విశ్వంలో అన్ని గ్రహాలు, నక్షత్రాలు, సూర్యుడు, చంద్రులను ఒకే కక్ష్యలో బంధించడానికి తగినంత గురుత్వాకర్షణ లేదు. చీకటి పదార్థం కాంతిని ఆకర్షించని లేదా కాంతిని విడుదల చేయని పదార్థాలతో తయారవుతుందని నమ్ముతారు. గత సంవత్సరం, కృష్ణ పదార్థాన్ని వెతకడానికి అమెరికాలో లక్స్ జెప్పెలిన్ ఎల్‌జెడ్ అనే ప్రయోగం జరిగింది. భూమి కింద చైనా పనిచేస్తున్న



ల్యాబ్‌కు జిన్‌పింగ్ ల్యాబ్ అని పేరు పెట్టారు. దానిని నిర్మించేందుకు మూడేళ్లు పట్టిందని చైనా ప్రభుత్వ వార్తా సంస్థ జిన్‌హువా గురువారం వెల్లడించింది. చైనీస్ మీడియా ప్రకారం.. డార్క్ మ్యాటర్ ఆవిష్కరణకు చైనా కంటే మెరుగైన ప్రదేశం ప్రపంచంలో మరొకటి లేదు. ఎందుకంటే వాటిలో అత్యంత అధునాతన ప్రయోగశాల ఉంది. ఈ ల్యాబ్ భూమి లోతుల్లో ప్రయోగాల కొత్త సరిహద్దులను తెరుస్తుందని భావిస్తున్నారు. మనం ఎంత లోతుకు వెళితే అంత ఎక్కువ కాస్మిక్ కిరణాలు ఆగిపోతాయని సింఘువా భౌతిక శాస్త్రవేత్త చెప్పారు. ఈ కారణంగా లోతైన ల్యాబ్ కృష్ణ పదార్థాన్ని గుర్తించడానికి అనువైన 'అల్ట్రా-క్లీన్' సైట్‌గా పరిగణించబడుతుంది.

## గుజరాత్‌లో ఘరానా మోసం..ఏకంగా హైవేపై
# నకిలీ టోల్ ప్లాజా.. రూ. కోట్లు దోపిడి..



**న్యూఢిల్లీ :** నేరాల తీరు మారుతోంది. గతంలో ఇంటికి కన్నాలు వేసే పద్ధతిలో నేరాలు జరగడం లేదు. ఇప్పుడంతా సైబర్ దాడులు, టెక్నాలజీ ఆధారిత మోసాలకు పాల్పడుతున్నారు కేటుగాళ్లు. ఇదిలా ఉంటే గుజరాత్‌లో జరిగిన ఓ నేరం గురించి తెలిస్తే, మోసగాళ్లు ఎంతగా తెలివిగా ప్లాన్ చేశారో తెలుస్తోంది. ఏకంగా ఓ హైవే ప్రత్యామ్నాయంగా రోడ్డు నిర్మించి నకిలీ టోల్‌ప్లాజాను ఏర్పాటు చేసుకుని దర్జాగా ఏడాదిన్నర పాటు దోపిడీ చేశారు. ఏకంగా ప్రభుత్వాన్ని మోసం చేయడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన గుజరాత్ లోని బమన్ బోర్-కచ్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. అయితే జాతీయరహదారిని బైపాస్ చేసే రోడ్డుపై ఓ ప్రైవేట్ ల్యాండ్‌లో టోల్ ప్లాజా ఏర్పాటు చేసి, హైవేపై వసూలు చేస్తున్న టోల్‌లో సగం డబ్బులు వసూలు చేస్తున్నారు. మోర్బీ జిల్లాలో ఈ బైపాస్ రోడ్డును నిర్మించి, ఏకంగా ఏడాదిన్నర పాటు టోల్ వసూలు చేసి కోట్ల రూపాయలను కొల్లగొట్టారు. వివరాల్లోకి వెళితే మోర్బీ -కచ్ జిల్లాలను కలిపే 8ఏ నేషనల్ హైవేపై వాఘసియా టోల్ ప్లాజా ఉంది. అయితే ఈ టోల్ ప్లాజాకు తగలకుండా.. ఓ బైపాస్ రోడ్డు ఉండేది. టోల్ ఛార్జీలు తగలకుండా వాహనదారులు ఈ రోడ్డును వినియోగించే వారు. అయితే దీన్ని గమనించిన కొందరు కేటుగాళ్లు నిరుపయోగంగా ఉన్న ఓ సిరామిక్ కంపెనీని అడ్డుకు తీసుకుని దానికి ఇరువైపులా హైవే వరకు బైపాస్ రోడ్డు నిర్మించి ఫ్యాక్టరీలోనే టోల్ ప్లాజా ఏర్పాటు చేశారు. అయితే హైవేతో పోలిస్తే.. నకిలీ టోల్ ప్లాజాలో తక్కువ డబ్బులు వసూలు చేస్తుండటంతో దీనిపై వాహనదారులు కూడా ఫిర్యాదు చేయలేదు. ఇటీవల ఈ వ్యవహారంపై స్థానిక మీడియాలో వార్తలు రావడంతో ఈ నకిలీ వ్యవహారం గుట్టురట్టైంది. ఈ మోసంలో ఏకంగా రూ.75 కోట్లు వసూలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ కేసులో వైట్ హౌస్ సిరామిక్ కంపెనీ యజమాని అమర్షి పటేల్, వనరాజ్ సింగ్ ఝాలా, హర్విజయ్ సింగ్ ఝాలా, ధర్మేంద్ర సింగ్ ఝాలా, యువరాజ్ సింగ్ ఝాలా మరియు గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్న మోర్బి జిల్లా కలెక్టర్ జీటీ పాండ్యా తెలిపారు.

## కోవిడ్ వ్యాక్సిన్-గుండెపోటు మరణాలకు
# సంబంధం లేదు.. ఆరోగ్య మంత్రి కీలక వ్యాఖ్యలు..




కోవిడ్-19 వ్యాక్సినేషన్ తర్వాత యువకుల్లో అనూహ్యంగా ఆకస్మిక మరణాలు పెరగడం ప్రజల్ని ఆందోళనపరిచింది. ఇలా హఠాత్తుగా ఎలాంటి అనారోగ్యం లేని యువకులు గుండెపోటులో మరణించిన కేసులు దేశవ్యాప్తంగా నమోదయ్యాయి. అయితే కోవిడ్-19 వ్యాక్సినేషన్ వల్ల భారతదేశ యువకుల్లో మరణాలు సంభవించే ప్రమాదాన్ని పెంచలేదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నిర్వహించిన అధ్యయనంలో తేలిన వివరాలను ప్రభుత్వం శుక్రవారం పార్లమెంట్‌కి తెలియజేసింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర ఆరోగ్యమంత్రి మన్సుఖ్ మాండవీయ వ్రాతపూర్వక సమాధానం ఇచ్చారు. కోవిడ్-19 కారణంగా ఆస్పత్రిలో చేరిన తర్వాత, ఫ్యామిలీ హిస్టరీలో సడన్ డెత్స్, కొన్ని జీవనశైలి కారణాలు వివరించలేదని ఆకస్మిక మరణాల సంభావ్యతను పెంచాయని చెప్పారు. దేశంలో కోవిడ్ వ్యాక్సినేషన్, గుండెపోటులకు మధ్య ఏదైనా సంబంధం ఉందా..? అనే ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. కోవిడ్ బారిన పడిన తర్వాత కొంతమందిలో ఆకస్మిక మరణాలు నమోదయ్యాయి. అయితే ఇలాంటి మరణాలకు కారణాలను నిర్ధారించడానికి తగిన ఆధారాలు అందుబాటులో లేవని మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పారు. భారతదేశంలో యువకుల్లో కోవిడ్-19 వ్యాక్సిన్ ఆకస్మిక మరణాలను పెంచలేదని చెప్పారు. కోవిడ్ తర్వాత పెరుగుతున్న గుండె సంబంధ మరణాలపై ఐసీఎంఆర్ అధ్యయనం చేసింది. 18-45 ఏళ్లలోపు యువతతో ఆకస్మిక మరణాలపై, మే నుంచి ఆగస్టు వరకు 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఉన్న 47 మెడికల్ కేంద్రాలలో మల్టీ సెంట్రిక్ కేస్ కంట్రోల్ అధ్యయనం చేసింది. అధ్యయనంలో వారి జీవనశైలి, మద్యం, ధూమపాన అలవాట్లు, కుటుంబ చరిత్ర, మాదకద్రవ్యాల వినియోగం, మరణాలకు రెండు రోజుల ముందు శారీరక శ్రమకు సంబంధించిన పలు అంశాలను కూడా అధ్యయనం చేశారు. కోవిడ్ వ్యాక్సినేషన్, ఇన్‌ఫెక్షన్, కోవిడ్ తర్వాత పరిస్థితులు ఇలా అన్నింటిని ఐసీఎంఆర్ పరిశీలించింది.

# బాల్య వివాహాలను రూపుమాపాలి!



కామారెడ్డి : బాల్య వివాహాలను రూపుమాపాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బాలరక్ష భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న అనాళ పిల్లల వివరాలను అంగన్‌వాడీ కార్యకర్తలు సేకరించాలని తెలిపారు. అనాథ పిల్లలకు ధ్రువీకరణ పత్రం వచ్చిందా లేదా తెలుసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో అనాథ పిల్లల కోసం సీట్లు ఉంటాయని తెలిపారు. అనాథ పిల్లలు వసతి గృహాల్లో ఉండి ఉన్నత విద్యను పూర్తిచేసే విధంగా అధికారులు చూడాలని తెలిపారు. ఎవరైన పిల్లలను భిక్షాటన చేయిస్తే వారిని పట్టుకుని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పదో తరగతి పూర్తి చేసిన అనాథ బాలికలు, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అనాథ బాలికలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ పొదుపుపై వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను ఆదా చేయుటకు వినియోగదారులు పాటించాల్సిన సూచనలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌సీ రమేష్‌బాబు, డీఈ సాలియా నాయక్, వెంకట రంగయ్య, ఏడీఈలు జవహర్ నాయక్, మల్లేష్, ఏఈ ప్రభాకర్, ధర్మారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


# అట్టహాసంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఖానాపూర్, : మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి, లలితాపరమేశ్వరి దేవాలయ అష్టమ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మొదటిరోజు ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు అమ్మవారికి, అయ్యప్ప స్వామికి నిత్యపూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ప్రత్యేకపూజలు సా యంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపుతో ముగిశాయి. మహిళలచే కుంకు మార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారంతో వార్షికో త్సవ వేడుకలు ముగియనున్నాయి. చివరిరోజు మధ్యాహ్నం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఆలయ ఆవరణలో చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో



మహాపడిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వా హకులు కొత్తపల్లి సురేష్, ఏ.రాజన్న, అశోక్‌కుమార్‌లు తెలిపారు. ఆల యానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# పనుల లక్ష్యాలను అధిగమించాలి



వికారాబాద్ : అభివృద్ధి పనుల్లో అధికారులు సమన్వయంతో పని చేసి లక్ష్యాలను అధిగమించాలని జిల్లా జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, గొర్రెల పంపిణీ, మన ఊరు–మన బడి, తాగునీటి సరఫరా తదితర అంశాలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎంపీవోలు, ఏపీవోలు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చేపట్టిన పంచాయతీ భవన నిర్మాణాలు, మన ఊరు–మనబడి కింద చేస్తున్న పనులు, సీడీపీ, ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజోపయోగ పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలన్నారు. పంచాయతీల్లో ట్రాక్టర్ల ఈఎంఐలు పెండింగ్‌లో ఉన్నాయని చెబుతూ.. ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధులు పంచా య తీల ఖాతాల్లో వేయడం జరిగిందన్నారు. వెంటనే పంచాయతీలు పెండి ంగ్ ఈఎంఐలను చెల్లించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డులకు జిల్లా నుంచి 169 గ్రామాల ప్రతిపాదనలు పంపామని, పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులేమైనా ఉ ంటే వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. పారిశుద్ధ్య, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, మురుగు కాలువలు వంటి పనులను మే 15 లోపు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేసే నల్లాలకు తప్పనిసరిగా ఫ్లో కంట్రోల్ వాల్వ్‌లు బిగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేసేందుకు కూలీల సంఖ్యను సంఖ్యలో పెంచి చేపట్టిన పనులను సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీకి డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిరుల వాటా(మార్జిన్ మనీ)ను పెంచేలా దృష్టి సారించాలని ఆదేశించారు. వికారాబాద్ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు పాఠశాలల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ 2023–24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతి డే స్కాలర్, ఐదో తరగతి రెసిడెన్షియల్‌కు ఎస్సీ విద్యార్థినీవిద్యార్థులను చేర్చుకునేందుకు ఆసక్తి గల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# ఉపాధిహామీకి దూరం దూరం..



సిద్దిపేట : ఉపాధిహామీ పనులకు క్రమంగా ఆదరణ తగ్గుతున్నది. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పనులకు వెళ్లే కూలీల సంఖ్య పూర్తిగా తగ్గింది. ఒకప్పుడు కూలీలు పూర్తిస్థాయిలో హాజరై పనిదినాలను పూర్తిచేసుకునేవారు. ఇప్పుడు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 30శాతం కూడా ఉపాధి కూలీలు పనికి వెళ్లడం లేదంటే అతిశయోక్తి కాదు. ఉపాధి హామీ పని ఇంతకుముందు స్టేట్ కమాండింగ్ కంట్రోల్‌లో ఉ ండేది ఇప్పుడు "ఎన్ఐసీ"కి వెళ్లడంతో కొత్తరూల్స్ వచ్చాయి. దీంతో చాలామంది కూలీలు ఆసక్తి చూపడం లేదు.సిద్దిపేట జిల్లాలో 2,10, 849 జాబ్ కార్డులున్నాయి. జాబ్‌కార్డులో నమోదైన కూలీల సంఖ్య 4,39,396. ఇందులో కూలీకి వెళ్లే వారి సంఖ్య 2.10లక్షలు. గతేడాది ఏప్రిల్‌లో 62వేల మంది కూలీలు పనులకు వెళ్తే ఈ ఏడాది కేవలం 30వేల మంది మాత్రమే పనిచేశారు. సగటున కేవలం 15 నుంచి 20 శాతం మంది మాత్రమే ఉపాధి పనికి వెళ్తున్నారు. 100 రోజుల పనిదినాల సంఖ్య ఉన్నప్పటికీ కొంత మంది కూలీలు ఇ ప్పటికీ కొత్త పనులను ప్రారంభించలేదు. గతంలో ఉపాధిహామీ కూలీలు గ్రూపుగా ఏర్పడి తమకు కేటాయించిన పనిని గంట రెండు గంటల్లో పూర్తిచేసుకుని వచ్చి మరో పనికి వెళ్లేవారు. కానీ ప్రస్తుతం ఫొటో క్యాప్చర్ విధానం వల్ల సగటున కూలీ ఉపాధిహామీ పని వద్ద నాలుగు గంటలు వేచి ఉ ండాల్సిందే. ఉదయం పనికి వెళ్లగానే ఫొటో క్యాప్చర్ చేసుకుంటే, మళ్లీ నాలుగు గంటల తర్వాత ఫొటో క్యాప్చర్ చేసుకోవాలి. నాలుగు గంటలు అక్కడే ఉండలేక కూలీలు పని అంటేనే ఆసక్తి చూపడం లేదు. గతంలో కంటే కూలి కూడా చాలా తక్కువగా రావడం కూడా ఒక కారణం. ఒకప్పుడు 272 రూపాయలు చెల్లించేవారు. ఇప్పుడు రూ.178 మాత్రమే ఇస్తున్నారు. ఇక ఉపాధిహామీ స్టేట్ గవర్నమెంట్ కంట్రోల్‌లో ఉన్నప్పుడు మార్చిలో రూ.25, ఏప్రిల్, మే నెలలో రూ.30 కూలి అదనంగా జమయ్యేది. కానీ ప్రస్తుతానికి అందడం లేదు. వేసవిలో అదనపు కూలి పడకపోవడం, తాగునీరు, గడ్డపార, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో ఆసక్తి చూపడం లేదు. కూలీలను అధిక సంఖ్యలో పనికి తీసుకురావాలన్న అధికారుల ప్రయత్నాలు కొత్తరూల్స్ ముందు పనిచేయడం లేదు. గతంలో ఉపాధి పనికి వెళ్తే గంటో, రెండు గంటలో పనిచేసుకుని వచ్చేవాళ్లం. కూలి కూడా సకాలంలో అందేవి. కానీ ఇప్పుడు నాలుగు గంటలు పనిచేయాలంటున్నరు. ఇంత చేసినా రూ.200 పడడం లేదు. ఆ నాలుగు గంటల సమయంలో బయట కూలికి వెళ్తే రూ.300 వస్తాయి. కొత్తగా రూల్స్ తీసుకొచ్చి ఉపాధిహామీ పనిని కష్టం చేశారు.

# మెదక్ జిల్లాకేంద్రంలో కనిపించని ఫుట్‌పాత్‌లు

మెదక్ : జిల్లాకేంద్రం ఏర్పడ్డాక రోడ్డు విస్తరణ కోసం కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. తదుపరి 100 ఫీట్లమేర రోడ్డును విస్తరిస్తూ పనులను సైతం పూర్తి చేశారు. మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసుకొని మున్సిపల్ ఆధ్వర్యంలో చెట్లను సైతం నాటించి పచ్చదనానికి ప్రాధాన్యతినిచ్చారు. వీటితో పాటు రోడ్డుకు రెండు వైపులా ప్రధాన మురికి కాలువ నిర్మించి పైకప్పును వేయడం జరిగింది. దీనిపై టైల్స్ వేసి పాదాచారులకు ఫుట్‌పాత్ ఏర్పాటు చేసేందుకు రూ. రెండు కోట్లను కేటాయించారు. మెదక్ జిల్లాకేంద్రంలో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేస్తున్న ఫుట్‌పాత్ యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నది. వారం క్రితం రూ. 2 కోట్లతో ప్రధాన రహదారి పక్కన ఫుట్‌పాత్ నిర్మాణ పనులు ప్రారంభించారు. గాంధీనగర్ నుంచి ప్రారంభించిన నిర్మాణ పనులు ఓవైపు కొనసాగుతుండగానే.. పూర్తయిన చోట ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నారు. మార్కెట్ కమిటీ కమాన్, పాతబస్టాండ్, మున్సిపల్ ఆఫీస్ ఎదుట, ఎంజీరోడ్డు,



రాందాసచౌరస్తా, రామాలయం రోడ్డు, న్యూబస్టాండ్‌లకు వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్ ఆక్రమణకుగురైంది. దుకాణాదారులు, చిరువ్యాపారులు సామగ్రిని ఫుట్‌పాతపైనే పెడుతున్నారు. కొన్నిచోట్ల ఫుట్‌పాత్‌పైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. జిల్లాకేంద్రంలో వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ సౌకర్యం ఎక్కడా కనిపించడం లేదు. రోడ్డు ఎత్తు తక్కువగా ఉన్నచోట ఏకంగా ఫుట్‌పాత్‌పైనే పార్కింగ్ ఏర్పాటు చేసుకుంటున్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకూ సన్నబియ్యం



పెద్దపల్లి :ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ సన్న బియ్యంతో వండిన భోజనాలు పెట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సంతకం కూడా చేశారు. వచ్చేనెల నుంచి అమలు చేసే అవకాశాలున్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారి సంఖ్య మరింత పెరగనున్నది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా ఆయా కేంద్రాల్లో నమోదై ఉన్నటువంటి గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మధ్యాహ్నం పూట పోషకాలతో కూడుకున్న భోజనాన్ని అందిస్తున్నారు. భోజనంలో ప్రతిరోజు ఉడకబెట్టిన కోడిగుడ్డును అందిస్తున్నారు. అలాగే గ్లాస్ పాలను కూడా సరఫరా చేస్తున్నారు. మెనూ ప్రకారం పోషకాలు కలిగిన ఆకు కూరలు, పప్పు దినుసులు, ఇతర కూరగాయలతో వండిన భోజనాలను పెడుతుంటారు. జిల్లాలో 701 అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు 5 మినీఅంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 4,322 మంది గర్భిణులు, 4,481 మంది బాలింతలు, 3787 మంది 7 నెలల నుంచి ఏడాదిలోపు పిల్లలు, 15,110 మంది ఏడాది నుంచి మూడేళ్ల వరకు గల పిల్లలు, 8,891 మంది 3 నుంచి 6 ఏళ్ల వయస గల పిల్లలు ఉన్నారు. మొత్తం 36,591 మంది ఉన్నారు. వీరికి మధ్యాహ్నం భోజనం పెట్టేందుకు గాను ప్రభుత్వం ప్రతి నెలా 342 క్వింటాళ్ల బియ్యం కేటాయిస్తున్నది. ఈ కేంద్రాల్లో ఆరు మాసాల క్రితం వరకు దొడ్డు బియ్యంతో వంటిన భోజనాన్ని అందించారు. ఆ తర్వాత పోషకాలు కలిసిన ఫోర్టిఫైడ్ రైస్‌ను సరఫరా చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2015 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, ఎస్సీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు దొడ్డు బియ్యంకు బదులు సన్న బియ్యం సరఫరా చేస్తున్నది. అప్పటినుంచే అంగన్‌వాడీ కేంద్రాలకు దొడ్డు బియ్యంకు బదులు సన్న బియ్యం సరఫరా చేయాలనే డిమాండ్ ఉంది. అంగ్‌వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా బియ్యం సరఫరా అవుతున్నాయి. అధిక పోషకాలు ఉన్నాయనే కారణంగా ఇన్నాళ్లు దొడ్డు బియ్యంను సరఫరా చేశారు. ఆ తర్వాత ఫోర్టిఫైడ్ రైస్‌ను అందజేస్తున్నారు. అయితే ఈ బియ్యంతో వండిన భోజనాలను తినేందుకు గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రావడం లేదని గమనించిన ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేయాలని నిర్ణయం తీసుకున్నది. రెండు రోజుల క్రితం ఏప్రిల్ 30న హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన కొత్త సచివాలయం ప్రారంభించిన అనంతరం తమ కార్యాలయాల్లో కొలువుదీరిన మంత్రులు పలు ఫైళ్లపై సంతకాలు చేశారు. అందులో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం సరఫరా చేసే ఫైలుపై సంతకం చేయడం గమనార్హం. ఈ మేరుకు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇకనుంచి సన్న బియ్యంతోనే భోజనాలు వండించనున్నారు. వచ్చేనెల నుంచే దీనిని అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వచ్చే నెలకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సన్న బియ్యం కేంద్రాలకు కేటాయించనున్నది. సన్న బియ్యం సరఫరా చేయడం వల్ల జిల్లాలో ప్రభుత్వంపై నెలకు 7 లక్షల రూపాయల వరకు అదనపు భారం పడనున్నట్లు అంచనా వేస్తున్నారు. సన్న బియ్యం సరఫరా చేసేందుకు నిర్ణయం తీసుకోవడం వల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు మరింత ప్రాధాన్యం పెరిగే అవకాశాలున్నాయి. గర్భిణులు, బాలింతలు, పిల్లల సంఖ్య పెరగనున్నది. సన్న బియ్యం సరఫరా చేయాలని తీసుకున్న నిర్ణయం వల్ల హర్షం వ్యక్తం అవుతున్నది.

# మరోసారి 5జీ స్పెక్ట్రమ్ వేలం.. ఉండే అవకాశం!




టెలికమ్యూనికేషన్ల శాఖ (డీఓటీ) మరోసారి 5జీ స్పెక్ట్రమ్‌ను వేలం వేయాలని భావిస్తోంది. 2024ల్లో ఇది ఉండే అవకాశం ఉందని డీఓటీ వర్గాలు వెల్లడించాయి. ఈ సారి 2.5 లక్షల కోట్ల విలువైన స్పెక్ట్రమ్‌ను వేలం వేయనున్నారు. 37 గిగాహెడ్జ్ పైగా ఉండే ఎయిర్ వేస్‌ను వేలం వేస్తారు. మొత్తం 11 బాండ్స్‌లో 600 మెగాహెడ్జ్ నుంచి 37 గిగా హెడ్జ్ వేలంలో ఉంచనున్నారు.

ఈ సారి వేలంలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ రెండు కంపెనీలో పాల్గనే అవకాశం ఉందని భావిస్తున్నారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వోడాఫోన్ ఐడియా ఈ సారి వేలానికి దూరంగా ఉండే అవకాశం ఉంది. మొదటి దఫా వేలంలో 5జీ స్పెక్ట్రమ్‌ను తీసుకున్నప్పటికీ వోడాఫోన్ ఐడియా ఇంత వరకు ఈ సర్వీస్‌లను లాంచ్ చేయలేకపోయింది. నిధుల కొరతే ఇందుకు ప్రధాన కారణం. 2024 నాటికి భారతీ ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియా కంపెనీలకు కొన్ని సర్కిల్స్‌లో లైసెన్స్ గడువు తీరనుంది. ఈ సర్కిల్స్‌లో ప్రధానంగా పశ్చిమ బెంగాల్, అస్సాం, బీహార్, ఒడిషా రాష్ట్రాలు ఉ న్నాయి. ఈ సర్కిల్స్‌కు ఈ సారి వేలంలో డిమాండ్ చాలా పెరుగుతుందని భావిస్తున్నారు. 2022లో జరిగిన వేలంలో ఉత్తర ప్రదేశ్‌ల సర్కిల్‌కు లైసెన్స్ గడువు తీరిపోవడంలో వేలంలోలో గతం కంటే 80 శాతం అధిక రేటు వచ్చింది. మొదటిసారి వేలంలో ఎవరూ తీసుకోని స్పెక్ట్రమ్‌ను కూడా ఈ సారి వేలంలో ఉంచుతారు. 5జీ సర్వీస్‌లకు 3300 మెగాహెడ్జ్ బాండ్‌కు ఎక్కువ డిమాండ్ ఉండే అవకాశం ఉంది. మొదటి సారి వేలంలో ప్రభుత్వానికి 1,50,173 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. జియో 5జీ కోసం 88,078 కోట్ల రూపాయల విలువపై స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేసింది. భారతీ ఎయిర్ టెల్ 43,084 కోట్ల విలువైన స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేసింది. వోడాఫోన్ ఐడియా ఇందుకు 18,799 కోట్లు ఖర్చు చేసింది. అదానీ డేటా నెట్‌వర్క్ సంస్థ 212 కోట్ల విలువైన స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేసింది. ఈ సారి ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ 700 మెగాహెడ్జ్ ,3300 మెగాహెడ్జ్, 26 గిగాహెడ్జ్ బాండ్‌ను కోరుతున్నది. ప్రభుత్వం ఈ స్పెక్ట్రమ్‌ను బీఎస్ఎన్ఎల్‌కు కేటాయిస్తే యూజర్లకు ఎంతో మేలు జరుగుతుంది. రెండు ప్రైవేట్ సంస్థలతో పోల్చుకుంటే ప్రభుత్వ రంగ సంస్థ యూజర్లకు తక్కువ రేటుకే 5జీ సర్వీస్‌లను అందించగలదని టెలికం రంగ నిపుణులు సూచిస్తున్నారు.

# నిధులున్నా.. రోడ్ల విస్తరణ పనులపై నిర్లక్ష్యం..!

నారాయణరావుపేట : గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం నారాయణరావుపేట మండలం గోపులాపూర్‌లో రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించినా.. పనుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఏడేళ్ల క్రితమే మంత్రి హరీశ్‌రావు నిధులు మంజూరు చేయించినా గ్రామంలోని ప్రజాప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. రోడ్డు విస్తరణలో సుమారు 22 ఇళ్లు పాక్షికంగా, పూర్తిగా కోల్పోయే పరిస్థితి ఉన్నది. రోడ్డు విస్తరణ పనులు చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నా ఇళ్లు పోయే బాధితులకు సరైన భరోసా ఇచ్చేందుకు గ్రామ ప్రజాప్రతినిధులు ముందుకురాకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి. రోడ్డు విస్తరణ పనులకు రూ.80 లక్షల నిధులు మంజూరై ఉన్నాయి. కాంట్రాక్టర్ అగ్రిమెంట్ గడువు కూడా రెండుసార్లు ముగిసింది. జక్కాపూర్ నుంచి నారాయణరావుపేట మండల కేంద్రం మీదుగా వెళ్లే వాహనాలకు గోపులాపూర్‌లో రోడ్డు విస్తరణ చేయకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంవత్సరం గడువున్నా గోపులాపూర్‌లో ఓట్ల అంచనాలు ఇప్పటికే మొదలయ్యాయి. గ్రామంలో చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనుల్లో ముందుకొచ్చే నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు చిలిపోయే ప్రమాదం లేకపోలేదనే అంచనాలతో పనులకు ముందుకు రావడం



లేదనే ఆరోపణలు లేకపోలేదు. వెంటనే ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాభివృద్ధికి పాటుపడాలని గ్రామస్థులు కోరుతున్నారు. రోడ్డు విస్తరణలో సుమారు 22 ఇళ్లు కోల్పోతున్నారు.

బాధితులు, గ్రామస్థులు సహకరిస్తే రోడ్డు విస్తరణ పనులు చేపడుతాం. రోడ్డు విస్తరణకు నిధులు ఉన్నాయి. ఇప్పటికే రెండుసార్లు విస్తరణ పనులకు కాంట్రాక్టర్‌తో అగ్రిమెం ట్ గడువు ముగిసింది. రోడ్డు విస్తరణ గురించి బాధితులతో భరోసా కల్పిస్తున్నాం. గ్రామంలో పండుగ ఉ న్నందున పనులు చేపట్టలేదు. నెల రోజుల వ్యవధిలో మంత్రి సహకారంతో రోడ్డు పనులు పూర్తిచేసి గ్రామాబివృద్ధికి కృషిచేస్తాం.

## పంచాయతీ కార్యదర్శులకు

# ఉద్యోగ భద్రత కల్పించాలి

నల్లగొండ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పిం చాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ప్రాంతంలో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మద్దతు తెలిపారు. మద్దిరాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్నజూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సీపీఎం జిల్లా నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, పులుసు సత్యం మద్దతు తెలి పారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సర్పంచ్‌లు చిలువేరు భవానీలింగరాజు, వెలుగు వెంకన్న, దామెర్ల వెంకన్న, బొబ్బిలి నర్సమ్మ పండ్లు పంపిణీ చేశారు. అర్వపల్లిలోని మండల పరిషత కార్యాలయం ఎదుట జూని యర్ పంచాయతీ కార్యదర్శులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నవీనరెడ్డి, నెహ్రూనాయక్, రవీందర్‌రెడి పాల్గొన్నారు. ఆత్మకూర్‌లో



నిర్వహించిన సమ్మెలో అనూష, లింగయ్య, హరి కృష్ణ, రవీందర్, రఘరెడ్డి, ఉపేందర్, జరీనా బేగం, పాల్గొన్నారు. –మేళ్లచెర్వులో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు డీవై ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోయిళ్ల నవీన సంఘీభావం తెలిపారు. –పంచాయతీ కార్యదర్శుల శాంతియుత సమ్మెకు సర్పంచ పోరం మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, చనుపల్లి సర్పంచ గురవయ్య, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మాల వెంకటప్పయ్య మద్దతు పలికారు.

# గిల్‌కి షాకిచ్చిన బాబర్

అంతర్జాతీయ క్రికెట్లో అత్యుత్తమ ప్రదర్శన చేస్తున్న ఆటగాళ్ళకు మరింత ప్రోత్సాహకం అందించే విధంగా ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ఎప్పటికప్పుడు ర్యాంకింగ్స్ తో పాటు అవార్డులను కూడా ప్రకటించడం లాంటివి చేస్తూ ఉంటుంది అని చెప్పాలి.ఇక ప్రతి నెల మంచి ప్రదర్శన చేసిన ఆటగాళ్ళకి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును కట్టబెట్టడం చేస్తూ ఉంటుంది.

అంతేకాదు ప్రతివారం కూడా అటు ఐసిసి మూడు ఫార్మాట్లలో ర్యాంకింగ్స్ ప్రకటిస్తూ ఉంటుంది. అయితే ఇక ఇలా ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించే ర్యాంకింగ్స్ లో అగ్రస్థానాన్ని దక్కించుకోవాలని ఎంతో మంది క్రికెటర్లు ఆశపడుతూ ఉంటారు. అయితే గత కొంతకాలం నుంచి టీమ్ ఇండియా ఆటగాళ్లు ఐసిసి ర్యాంకింగ్స్ లో సత్తా చాటుతూ ఉన్నారు. మూడు ఫార్మాట్ లో కూడా నెంబర్ వన్ స్థానంలో కొనసాగుతూ అదరగొడుతూ ఉన్నారు. అయితే t20 లలో నెంబర్ వన్ బ్యాట్స్మెన్ గా సూర్య కుమార్ యాదవ్ ఉండగా.. ఇక వన్డేలలో నెంబర్ వన్ బ్యాట్స్మెన్ గా టెస్టులలో బౌలర్, ఆల్ రౌండర్ లో జాబితాలో అశ్విన్ జడేజాలు నెంబర్ వన్ స్థానంలో ఉన్నారు. అయితే ఇటీవలే మరోసారి ఐసీసీ ర్యాంకింగ్స్ ప్రకటించింది. కాగా సూర్య కుమార్ యాదవ్ మరోసారి తన అగ్రస్థానాన్ని పదిలంగానే ఉ




ంచుకున్నాడు అని చెప్పాలి. కానీ యంగ్ బ్యాట్స్మెన్ శుభమన్ గిల్ మాత్రం.. వన్డేలలో నెంబర్ వన్ స్థానంలో ఉండగా.. ఇక ఇప్పుడు అతనికి షాక్ తగిలింది ఎందుకంటే మొన్నటికి మొన్న అగ్రస్థానాన్ని కోల్పోయిన పాకిస్తాన్ మాజీ కెప్టెన్ బాబర్ మళ్లీ తన స్థానాన్ని దక్కించుకున్నాడు. ఇటీవల ప్రకటించిన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ లో 824 పాయింట్ల తో బాబర్ అగ్రస్థానం కైవసం చేసుకున్నాడు ఇక మొన్నటి వరకు తొలి స్థానంలో ఉన్న టీమిండియా బ్యాట్స్మెన్ గిల్ 810 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు.

# టీమిండియాకు డూ ఆర్ డై మ్యాచ్..

ప్రస్తుతం భారత జట్టు దక్షిణాఫ్రికా పర్యటనలో ఉంది అన్న విషయం తెలిసిందే. ఇక ఈ పర్యటనలో భాగంగా మూడు ఫార్మట్లలో కూడా సిరీస్ లు ఆడుతుంది టీమిండియా. ఈ క్రమంలోనే ఇక ఈ సిరీస్ లో భాగంగా ఇప్పటికే టీ20 సిరీస్ ముగించుకుంది. ఇక వన్డే సిరీస్ లో కూడా రెండు మ్యాచ్లు ముగిసాయ్. కాగా నేడు కీలకమైన డూ ఆర్ డై మ్యాచ్ ఆడబోతుంది టీమ్ ఇండియా. ఎందుకంటే ఇక మొదటి మ్యాచ్ లో ఘనవిజయాన్ని సాధించిన భారత జట్టు రెండో మ్యాచ్లో మాత్రం బ్యాటింగ్లో తడబడింది. పూర్తిగా నిరాశ జనకంగా బ్యాటింగ్ చేయడంతో చివరికి అటు సౌత్ ఆఫ్రికా ఘన విజయాన్ని అందుకుంది అని చెప్పాలి.దీంతో ఇక మొదటి మ్యాచ్ లో గెలిచి జోరు మీద ఉన్న టీమ్ ఇండియాకు.. రెండో మ్యాచ్ లోనే చెక్ పెట్టింది సౌత్ ఆఫ్రికా జట్టు. అయితే ప్రస్తుతం మూడు మ్యాచ్ల వన్డే సిరీస్ లో భాగంగా 1-1 తో సమంగా ఉంది. ఇక సిరీస్ గెలుచుకోవాలి అంటే ఈ రెండు టీమ్స్ కి కూడా ఒకే రకమైన అవకాశం ఉంది అని చెప్పాలి. కాగా నేడు మూడో మ్యాచ్ లో బరిలోకి దిగుతుంది టీమిండియా. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్ లో గెలిచి తప్పక సిరీస్ ను కైవసం చేసుకోవాలని భారత జట్టు పట్టుదలతో




ఉంది అని చెప్పాలి. కాగా ఫామ్ కోల్పోయిన తిలక్ వర్మ స్థానంలో మధ్యప్రదేశ్ బ్యాట్స్మెన్ రజాక్ పాటిదార్ తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే రెండో వన్డే మ్యాచ్లో సాధించిన విజయంతో ప్రస్తుతం దక్షిణాఫ్రికా జట్టు ఆత్మవిశ్వాసంతో ఉంది అని చెప్పాలి. ఓపెనర్ టోనీ జోర్జీ ఏకంగా సెంచరీ సాధించి ఫుల్ ఫామ్ లోకి వచ్చేసాడు. అయితే సౌత్ ఆఫ్రికా జట్టుపై విజయం సాధించాలి అంటే బౌలింగ్ విభాగంలో బ్యాటింగ్ విభాగంలో రానించి టీమ్ ఇండియా సమిష్టిగా రానిస్తేనే సాధ్యమవుతుంది.

# మంజ్రేకర్ కీలక వ్యాఖ్యలు?



ప్రస్తుతం భారత క్రికెట్లో ఎక్కడ చూసినా ముంబై ఇండియన్స్ కెప్టెన్ గా రోహిత్ శర్మను తప్పించడం పైన చర్చ జరుగుతూ ఉంది. ఐపీఎల్ హిస్టరీలోనే మోస్ట్ సక్సెస్ఫుల్ కెప్టెన్గా కొనసాగుతున్న రోహిత్ శర్మను సారధ్య బాధ్యతలు నుంచి తప్పించడం ఏంటి అని భారత క్రికెట్ ప్రేక్షకులు అందరూ కూడా ఇప్పటికీ షాక్ లోనే మునిగిపోయారు అని చెప్పాలి.అయితే గుజరాత్ టైటాన్స్ జట్టు నుంచి హార్దిక్ పాండ్యాను టీంలోకి తీసుకొని మరి అటు ముంబై యాజమాన్యం అతని చేతిలో కెప్టెన్సీ పెట్టడాన్ని అసలు జీవించుకోలేకపోతున్నారు రోహిత్ అభిమానులు. ఐపీఎల్ లో ఉన్న మిగతా టీమ్స్ యాజమాన్యాలు రోహిత్ లాంటి కెప్టెన్ కావాలి అనుకుంటుంటే.. ఇక ముంబై మాత్రం ఇక సక్సెస్ఫుల్ కెప్టెన్ ని పక్కన పెట్టడం ఏంటి అని విమర్శలు చేస్తూ ఉన్నారు. ఇక ఇది కాస్త ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారిపోయింది అని చెప్పాలి. ఇక ఇదే విషయం గురించి ఎంతోమంది మాజీ ఆటగాళ్లు కూడా స్పందిస్తూ తమ అభిప్రాయాలను రివ్యూల రూపంలో చెప్పేస్తూ ఉన్నారు. అయితే రోహిత్ శర్మను కెప్టెన్ గా మార్చిహార్దిక్ పాండ్యాను సారథిగా నియమించడంలో తప్పేముంది అంటూ ఇప్పటికే మాజీ ప్లేయర్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. ఇక ఇటీవల ఇదే విషయం గురించి టీమిండియా మాజీ ప్లేయర్ సంజయ్ మంజ్రేకర్ స్పందించాడు. రోహిత్ శర్మను కెప్టెన్ గా తొలగించడం పై ఎమోషనల్ గా ఆలోచించకూడదు అంటూ చెప్పుకొచ్చాడు. పాండ్యాను కెప్టెన్గా నియమించడం మంచి నిర్ణయమే అంటూ సమర్థించాడు సంజయ్ మంజ్రేకర్.

# రోహిత్ గైడెన్స్ మాకెంతో ముఖ్యం..?




ఇటీవలే ఐపీఎల్లో స్ట్రాంగ్ టీమ్ గా పేరు సంపాదించుకున్న ముంబై ఇండియన్స్ జట్టు యాజమాన్యం తీసుకున్న నిర్ణయం పై ప్రస్తుతం రోహిత్ శర్మ అభిమానులు అందరూ కూడా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు అన్న విషయం తెలిసిందే.ఏకంగా సారథిగా కొనసాగుతున్న రోహిత్ శర్మను తప్పించి కెప్టెన్సీ బాధ్యతలను హార్థిక్ పాండ్యాకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది జట్టు యాజమాన్యం. అయితే రోహిత్ లాంటి సక్సెస్ఫుల్ కెప్టెన్ కావాలని అన్ని టీమ్స్ కోరుకుంటుంటే.. అటు ముంబై మాత్రం ఇలాంటి అనూహ్యమైన నిర్ణయం తీసుకోవడంతో ప్రతి ఒక్కరు కూడా షాక్ లో మునిగిపోయారు అని చెప్పాలి. ఏకంగా ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించి ముంబై జట్టును ఛాంపియన్గా నిలిపిన రోహిత్ శర్మకు.. ఆ జట్టు యాజమాన్యం కనీస గౌరవాన్ని ఇవ్వలేదు అంటూ రోహిత్ అభిమానులు అందరూ కూడా సోషల్ మీడియాలో జట్టు యాజమాన్యంపై దుమ్మెత్తి పోస్తున్నారు. అంతేకాదు ఎంతోమంది ఇకనుంచి ముంబైకి మద్దతు తెలుపబోము అంటూ సోషల్ మీడియా ఖాతాలను అన్ ఫాలో చేస్తూ ఉండటం కూడా చూస్తూ ఉన్నాము అన్న విషయం తెలిసిందే. ఇక రోహిత్ కూడా ముంబై జట్టు నుంచి పక్కకు తప్పుకుంటాడు అంటూ వార్తలు వస్తున్నాయి. ఇక ఇలాంటి సమయంలో ముంబై జట్టు గ్లోబల్ హెడ్ కోచ్ మహేళ జయవర్ధనే ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మేం అభిమానుల ఎమోషన్స్ ను గౌరవిస్తున్నాం. రోహిత్ టీమ్ లో లేదా బయట నుండి భవిష్యత్తు తరాలకు గైడెన్స్ ఇవ్వడం మాకు ఎంతో ముఖ్యం. రోహిత్ వ్యక్తిత్వం అద్భుతం. ఆయన ఒక గొప్ప నాయకుడు అంటూ జయవర్ధనే కామెంట్ చేశాడు.

# ఇప్పుడు జింబాబ్వేకి మరో భారీ షాక్?

చిన్న టీమ్ అయినప్పటికీ ప్రతిభావంతులైన క్రికెటర్లు ఆ టీంలో ఉంటారు అంటూ మొన్నటి వరకు ఎంతో మంది క్రికెట్ విశ్లేషకులు జింబాబ్వేక్రికెట్ టీం గురించి మాట్లాడుకునేవారు. కానీ గత కొంతకాలం నుంచి ఈ జట్టు అటు తీరు మరింత నిరాశ జనకంగా మారిపోయింది అని చెప్పాలి. ఎప్పుడూ చెత్త ప్రదర్శనలతో తీవ్రస్థాయిలో విమర్శలు ఎదుర్కొంటుంది జింబాబ్వే. ఈ క్రమంలోనే ఇటీవలే ఇండియా వేదికగా ముగిసిన వన్డే వరల్డ్ కప్ తో పాటు 2024 t20వరల్డ్ కప్ లో కూడా అర్హత సాధించలేకపోయింది జింబాబ్వే. క్వాలిఫైయర్ మ్యాచ్ లలో అటు ప్రత్యర్థులకు కనీస పోటీ ఇవ్వలేక చివరికి ఇక వరల్డ్ కప్ లో చోటు సంపాదించుకోవాలనే కలను నెరవేర్చుకోలేకపోయింది అని చెప్పాలి. అయితే ఇలా క్వాలిఫైయర్ లో అర్హత సాధించకపోవడమే కాదు ఏకంగా సొంత గడ్డపై నమీబియా, ఐర్లాండ్ లాంటి చిన్న టీమ్స్ చేతిలో ఘోర పరాభవాన్ని ఎదుర్కొని తీవ్రస్థాయిలో విమర్శలపాలు అవుతుంది జింబాబ్వే జట్టు. ఇక ఇలా ఇప్పటికే నిరాశలో ఉన్న జింబాబ్వే టీంకు ఇక ఇప్పుడు మరో భారీ షాక్ తగిలింది అన్నది తెలుస్తుంది. ఆ



జట్టుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు శతవిధాల ప్రయత్నించిన హెడ్ కోచ్ డేవ్ హౌటన్ ఇక తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. ఈ విషయాన్ని జింబాబ్వేక్రికెట్ బోర్డు ఇటీవల అధికారికంగా ధ్రువీకరించింది అని చెప్పాలి. డెవ్ హౌటన్ కెప్టెన్ గా కోచ్గా ఉన్న కాలంలో జింబాబ్వే స్వర్ణ యుగాన్ని చూసింది. ఒక సమయంలో హౌటన్ తో కూడిన జింబాబ్వే ఆస్ట్రేలియా భారత్ లాంటి పటిష్టమైన టీమ్స్ ని సైతం గడగడలాడించింది అని చెప్పాలి. అలాంటి జింబాబ్వే ఇక ఇప్పుడు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటుంది.

# టాప్‌లోనే 'సూర్య' ఐసిసి టి20 ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజా టి20 ర్యాంకింగ్స్‌లో మిస్టర్ 360 డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్ టాప్‌లోనే నిలిచాడు. ఐసిసి బుధవారం విడుదల చేసిన బ్యాటర్స్ జాబితాలో సూర్యకుమార్ యాదవ్ 887రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. ఆ తర్వాత పాకిస్తాన్ వికెట్ కీపర్ రిజ్వాన్(787రేటింగ్ పాయింట్లు) రెండోస్థానంలో నిలిచాడు. రుతురాజ్ గైక్వాడ్(674) 7వ స్థానంలో నిలిచి టాప్10లో చోటు దక్కించుకున్నాడు. ఇక భారత యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్ బౌలింగ్ విభాగంలో 3వ స్థానానికి పడిపోయాడు.

టాప్‌లో ఇంగ్లండ్ స్పిన్నర్ అదిల్ రషీద్ ఎగబాకాడు. ఇంగ్లండ్ నుంచి టి20 క్రికెట్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకున్న బౌలర్లలో రషీద్ రెండో స్పిన్నర్ కావడం గమనార్హం. గతంలో గ్రేమ్ స్వాన్ ఇంగ్లండ్ తరఫున టి20లలో తొలి స్థానం దక్కించుకున్న దశాబ్దకాలం తర్వాత మరో స్పిన్నర్ ఈ ర్యాంకుకు చేరుకోవడం విశేషం. ప్రస్తుతం వెస్టిండీస్ పర్యటనలో ఉన్న రషీద్.. విండీస్‌తో జరిగిన మూడు మ్యాచ్‌లలో ఐదు వికెట్లు పడగొట్టాడు. దీంతో అతడు ఆఫ్ఘన్ స్పిన్నర్ రషీద్ ఖాన్, భారత యువ స్పిన్నర్ రవి బిష్ణోరులను వెనక్కినెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఆ తర్వాత జాబితాలో వనిందు హసరంగ, మహీశ్




తీక్షణ ఉన్నారు. టాప్-5లో ఉన్న బౌలర్లందరూ స్పిన్నర్లే కావడం గమనార్హం. టి20 ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా 196రేటింగ్ పాయింట్లతో 4వ స్థానంలో ఉండగా.. ఈ విభాగంలో షకీబ్-అల్-హక్(బంగ్లా) 272పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత మహ్మద్ నబి(ఆఫ్ఘన్) 210పాయింట్లు, ఆడెన్ మార్క్రమ్(దక్షిణాఫ్రికా) 205పాయింట్లతో టాప్-3లో ఉన్నారు.

# అద్భుతమైన బంతితో వికెట్ పడగొట్టిన రింకు సింగ్..?

ఇటీవల కాలంలో భారత క్రికెట్లో నయా ఫినిషర్ గా పేరు సంపాదించుకున్న రింకు సింగ్ పేరు తెగ హాట్ టాపిక్ గా మారిపోయింది అన్న విషయం తెలిసిందే. ఏకంగా ఈ ఏడాది జరిగిన ఐపిఎల్ లో మెరుపు ఇన్నింగ్స్ తో ఒక్కసారిగా వార్తల్లో నిలిచిన ఈ యువ క్రికెటర్..

ఇక టీమ్ ఇండియాలో ఛాన్స్ దక్కించుకున్నాడు. భారత జట్టు తరుపున కూడా అదే రీతిలో ఇన్నింగ్స్ లు ఆడుతున్నాడు. మొన్నటి వరకు టి20లలో మెరుపులు మెరూపించిన రింకు సింగ్.. ఇక సౌత్ ఆఫ్రికా పర్యటనలో టీమిండియా ఆడుతున్న వన్డే సిరీస్ లో వన్డే ఫార్మట్ లో కూడా ఛాన్స్ దక్కించుకున్నాడు. ఇక ఇటీవలే జరిగిన రెండో వన్డే మ్యాచ్లో ఇక వన్డేలోకి అరంగేట్రం చేసిన ఈ విధ్వంసకరమైన బ్యాట్స్మెన్ మొదటి మ్యాచ్ లో మాత్రం పెద్దగా పరుగులు చేయలేదు. పద్నాలుగు బంతుల్లో 17 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. ఇందులో రెండు ఫోర్లు ఒక సిక్సర్ ఉండడం గమనార్హం. అయితే కేవలం బ్యాటింగ్లో మాత్రమే కాదు బౌలింగ్లో కూడా సత్తా చాటాడు రింకు. ఏకంగా వికెట్ తీశాడు. రింకు సింగ్ ఏంటి బౌలింగ్ చేయడం ఏంటి అని ఆశ్చర్యంలో మునిగిపోతున్నారు కదా.. కానీ నిజంగానే ఇటీవల తన బౌలింగ్ తో అదరగొట్టాడు ఈ నయా ఫినిషర్. మంచి భాగస్వామ్యాన్ని



నిర్మిస్తూ స్కోరు బోర్డుని ముందుకు నడిపిస్తున్న వాండర్ డాసేన్ ను రింకు సింగ్ తెలివిగా బోల్తా కొట్టించాడు. రింకు వేసిన బంతిని అంచనా వేయడంలో విఫలమైన డాసేన్ వికెట్ కీపర్ సంజుకి క్యాచ్ ఇచ్చాడు. ఇక వికెట్ తీసిన అనంతరం ఎంతో గ్రాండ్ గా సంబరాలు చేసుకున్నాడు రింకు. ఇక సహచర ఆటగాళ్లు కూడా రింకు వికెట్ తీయడంతో ఆశ్చర్యంతో ఆనందం వ్యక్తం చేశారు.

# మూడో వన్డేతో కెరీర్‌కు గుడ్‌బై?

ఈరోజు పార్ల్‌లోని బోలాండ్ పార్క్ స్టేడియంలో భారత్ వర్సెస్ సౌతాఫ్రికా జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ సిరీస్ నిర్ణయాత్మకం. 3 వన్డేల సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉంది. కాబట్టి, నేటి మ్యాచ్‌లో గెలిచిన జట్టు ట్రోఫీని కైవసం చేసుకుంటుంది. కాబట్టి, ఈ మ్యాచ్ టీమ్ ఇండియాకు కీలకం. అలాగే, ఓ భారత బ్యాటర్‌కి కూడా ఈ మ్యాచ్ ఎంతో కీలకం కానుంది. ఈ మ్యాచ్‌లోనే రాణిస్తేనే, తదుపరి సిరీస్‌లకు అవకాశం ఉంటుంది. లేకపోతే, ఆ ప్లేయర్ కెరీర్ ప్రమాదంలో పడనుంది. భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన సంజూ శాంసన్‌కు ఇదే చివరి అవకాశం. ఎందుకంటే, జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన తొలి వన్డేలో శాంసన్ బ్యాటింగ్ చేయలేదు. రెండో మ్యాచ్‌లో విఫలమయ్యాడు. మూడో వికెట్ పతనం తర్వాత క్రీజులోకి వచ్చిన శాంసన్ 27వ ఓవర్లో 23 బంతుల్లో 12 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. ఇప్పుడు సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. జట్టులో స్థానం నిలబెట్టుకోవడానికి శాంసన్‌కి ఇదే చివరి అవకాశం. ఎందుకంటే, భారత జట్టులో మిడిలార్డర్‌లో ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్ లాంటి బలమైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. అతనితో పాటు





యువ స్ట్రైకర్లు తిలక్ వర్మ, రింకూ సింగ్ కూడా మెరుస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో శాంసన్ జట్టులో స్థానం నిలబెట్టుకోవాలంటే నేటి మ్యాచ్‌లో ప్రత్యేక ప్రదర్శన చేయాల్సి ఉంది.

# కుస్తీ వదిలేస్తున్నా.. ఏడ్చేసిన సాక్షీ మాలిక్

రెజ్లర్ సాక్షీ మాలిక్ ఆవేదనకు గురయ్యారు. రెజ్లింగ్ క్రీడను వదిలేస్తున్నట్లు ఆమె చెప్పారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్ష ఎన్నికల్లో .. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ విజయం సాధించడం .. మహిళా రెజ్లర్లను కలిచివేసింది. 40 రోజులగా రోడ్లపై ధర్నా చేపట్టామని, తమకు దేశవ్యాప్తంగా ప్రజలు అండగా నిలిచారని, కానీ ఎన్నికల్లో తమ అభ్యర్థి ఓటమి పాలైనట్లు సాక్షీ మాలిక్ ఇవాళ మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. బ్రిజ్ భూషణ్ బిజినెస్ పార్ట్నర్ విజయం సాధించారని, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని, అందుకే రెజ్లింగ్ క్రీడకు వీడ్కోలు పలుకుతున్నట్లు సాక్షీ మాలిక్ వెల్లడించారు. సంజయ్ గెలుపును తట్టుకోలేకపోయిన సాక్షీమాలిక్.. మీడియా సమావేశం నుంచి ఏడ్చుకుంటూ బయటకు వెళ్లిపోయారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా సంజయ్ సింగ్ ఎన్నిక కావడం.. రెజ్లింగ్ భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లినట్లు ఉందని రెజ్లర్ వినేశ్ పోగట్ తెలిపారు. తమకు స్వల్ప స్థాయిలో మాత్రమే నమ్మకం ఉందని, తమకు న్యాయం జరుగుతుందన్న ఆశ ఉన్నట్లు ఆమె చెప్పారు. తమ బాధను ఎవరికి చెప్పుకోవాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# పవర్ ప్లేలో తడబడ్డ భారత్.. ఆ ఇద్దరూ నిలబడతారా..?

సిరీస్ డిసైడర్ అయిన మూడో వన్డేలో భారత టాపార్డర్ విఫలమైంది. ఓపెనర్లు రజత్ పటిదార్(22 : 16 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్), సాయి సుదర్శన్(10 : 16 బంతుల్లో ఒక ఫోర్) తక్కువ స్కోర్‌కే వెనుదిరిగారు. దాంతో, టీమిండియా 10 ఓవర్లకు 2 వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసింది. ప్రస్తుతం సంజూ శాంసన్(11), కెప్టెన్ కేఎల్ రాహుల్(6) మరో వికెట్ పడకుండా జాగ్రత్తంగా ఆడుతున్నారు. బోలాండ్ పార్క్‌లో జరుగుతున్న మూడో వన్డేలో టాస్ గెలిచిన సఫారీ కెప్టెన్ మర్క్‌రమ్ బౌలింగ్ తీసుకున్నాడు. ఈ మ్యాచ్‌తో వన్డేల్లో అరంగ్రేటం చేసిన రజత్ పటిదార్(22) దూకుడుగా ఇన్నింగ్స్ ఆరంభించాడు. మరో ఎండ్‌లో సుదర్శన్ కూడా కాన్ఫిడెంట్‌గా కనిపించాడు. కానీ, బర్గర్ ఓవర్లో సిక్సర్ బాదిన పాటిదార్ మరో భారీ షాట్ ఆడబోయి బౌల్డయ్యాడు. ఆ కేసటికే హెండ్రిక్స్ ఫామ్‌లో ఉన్న సుదర్శన్‌ను ఎల్బీగా వెనక్కి పంపాడు. దాంతో, 49 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయిన జట్టును రాహుల్, శాంసన్ ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు.




Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**